వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

ఆదివారం 14, జూలై 2024 | 16 పేజీలు




# జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన



## కేజీబీవి తరగతి గదులు, వసతి గృహం ప్రారంభోత్సవం

## ప్రజాదర్బారులో పాల్గొన్న మంత్రి సీతక్క

## పోడు భూముల పట్టాలకి ప్రణాళికలు సిద్దం చేస్తున్నామంటూ వివరణ

## రాష్ట్రంలో తొలి కంటైనర్ ఆస్పత్రి ప్రారంభం

*ములుగు జిల్లా ప్రభాతవార్త :*

విద్యార్థులకు సంపూర్ణమైన విద్యను అందించాలని, విద్యార్థులు విద్యతో పాటు సమాజంపై కూడా అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర

16 పేజీలో


# గ్రేటర్‌లో గుట్టుగా గంజాయి దందా



2 లో..

# రక్తం చిందిన నేషనల్ హైవే

2 లో..



- ఘోర రోడ్డు ప్రమాదం
- ఆటోను ఢీ కొట్టిన కంటైనర్
- ముగ్గురు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం


**ఏటూర్‌నాగారం ప్రభాతవార్త:**

నేషనల్ హైవే 163 ఏటూరునాగారం హైవే ట్రీట్ ఫంక్షనల్ సమీపంలో శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోను ఢీకొట్టిన కంటైనర్ రక్తం చిందిన నేషనల్ హైవే ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలకు తరలించి చికిత్స










# గ్రేటర్‌లో గుట్టుగా గంజాయి దందా

మొదటి పేజీ తరువాయి

*వరంగల్ క్రైమ్,జూలై 13, ప్రభాత వార్త :*
గ్రేటర్ వరంగల్‌తో పాటు చుట్టుప్రక్కల గ్రామీణ ప్రాంతాల్లోనూ చాపకింద నీరులా గంజాయి, డ్రగ్స్ వేగంగా విస్తరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు గంజాయిని ఉక్కు పాదంతో అణచివేస్తామని ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిన ప్రత్యేక నిఘా పెడుతున్న కాని అంతే వేగంగా టీనేజ్ యువత గంజాయి డ్రగ్స్ బారిన పడి బాల్యాన్ని బుగ్గి పాలు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు ట్రై సిటికే పరిమితమైన గంజాయి, డ్రగ్స్ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా ఎక్కువగా వ్యాపించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

**స్లీపింగ్ పిల్స్, టానిక్ రూపంలో డ్రగ్స్ :**
డ్రగ్స్ గంజాయి సరఫరా చేసి ఏజెంట్లు రోజురోజుకు కొత్త తరహాలో సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా యువత సాధారణంగా గంజాయి సాల్వెంట్ గ్లూస్ (బోనఫిక్స్), పెట్రో కెమికల్స్) ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలతో పాటు ఇంజక్షన్స్ రూపంలో మత్తు పదార్థాలు తీసుకుంటున్నారు. కాని ఇప్పుడు గంజాయి మరియు డ్రగ్స్ స్లీపింగ్ పిల్స్, టానిక్ సిరప్ రూపంలో సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది..

**స్కూల్ కాలేజీ విద్యార్థులే ప్రధాన టార్గెట్ :**
ప్రధానంగా స్కూల్ 8,9,10 తరగతుల విద్యార్థులు (సాల్వెంట్ గ్లూస్) కాలేజీ ఇంటర్ నుండి బీటెక్ విద్యార్థులు గంజాయితోపాటు సింథటిక్ డ్రగ్స్ తీసుకుంటున్నారని డి అడిక్షన్ తెరపిస్టులు చెప్తున్నారు. నెలకు సరాసరి కేవలం వరంగల్ సిటీలోనే 150 నుండి 200 మంది విద్యార్థులు డ్రగ్స్ బారిన పడుతున్నారంటే యువత ఎంత ప్రమాదంలో పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

**డ్రగ్స్ దందా ఎలా వ్యాపిస్తుంది?**
డ్రగ్స్ దందా ప్రధానంగా మెడికల్ షాపులలో ఇంజక్షన్స్, స్లీపింగ్ పిల్స్, టానిక్ సిరప్స్, రూపంలో అమ్ముతున్నారు. పాన్‌షాపులు, రిక్రియేషన్ క్లబ్‌లతో పాటు గంజాయి ఇతరమత్తు పదార్థలకు అడిక్ట్ అయిన వారే తమ జల్సాలు మరియు పాకెట్ మనీ కోసం తమ తోటి విద్యార్థులకు అమ్ముతున్నారని పరిశీలకుల అభిప్రాయం.

**డ్రగ్స్‌కు అడ్డాగా రిక్రియేషన్ సెంటర్లు :**
ట్రై సిటీలో రిక్రియేషన్ సెంటర్ల పేరుతో విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ఇందులో కేవలం సిగరెట్లు తాగడానికి లేదా రిక్రియేషన్ కోసం క్యారం, చెస్ మొదలైన ఆటలు ఆడడానికి రిక్రియేషన్ కోసం ఏర్పాటు చేస్తున్నామని పోలీసులను, ప్రభుత్వాన్ని నమ్మించి నగరంలోని ప్రధాన కాలనీలలో ఏర్పాటు చేస్తున్నారు. కానీ ప్రధానంగా ఈ సెంటర్లలో గుట్టు చప్పుడు కాకుండా డ్రగ్స్ గంజాయి అమ్ముతున్నారని చుట్టప్రక్కల కాలనీ వాసులు చెప్తున్నారు. పోలీసులు కూడా ఇలాంటి స్థావరాలపై ప్రత్యేక దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.




**కంచే చేనుమేస్తుందా?**
యువత డ్రగ్స్ బారిన పడకుండా నిస్వార్థంగా నిర్మూలించవలసిన కొందరు పోలీసు అధికారులే తప్పుడు దారులు పడుతున్నారనేది నమ్మలేని నిజం. ఎంతో కష్టపడి భారీ ఎత్తున స్వాధీన పరుచుకున్న గంజాయి డ్రగ్స్‌ను కాసులకు కక్కుర్తిపడి తిరిగి ఏజెంట్లకు అమ్ముతున్నారని కొందరు అధికారులు చెప్పున్నారంటే కంచే చేను మేస్తుందనేది అక్షరాల నిజం. యువత ఎందుకు మత్తు పదార్థాల బారిన పడుతున్నారు? ప్రధానంగా పేరెంట్స్ పర్యవేక్షణ లోపం, సింగిల్ పేరెంట్ పిల్లలు, మత్తు పదార్థాల బారిన పడిన విద్యార్థులతో స్నేహం చేయడం, ఎద్యుకేషన్ సిస్టం లోపం, మానసిక పరిపక్వత లేకపోవడం అకాడమిక్ బర్డెన్, ప్రచార మాధ్యామాల ప్రభావం, డ్రగ్స్ ప్రేరేపిత సినిమాలు. డ్రగ్స్ నిర్మూలనకు పటిష్టమైన యంత్రాంగంతో పాటు నిస్వార్థమైన సమాజం అవసరం.

**డా॥ పొట్టబత్తుల రాము**
**డి అడిక్షన్ థెరపిస్ట్, హెల్పింగ్ హాండ్ డి అడిక్షన్ ట్రీట్మెంట్ మరియు రిహబిలిటేషన్ సెంటర్**



మాది ఒకే ఒక ప్రభుత్వ ఆమోదిత వంద పడకల డి అడిక్షన్ సెంటర్ ప్రధానంగా డ్రగ్స్, గంజాయి మన జిల్లాలో 2000 సంవత్సరం నుండి ప్రారంభమైంది. గత కొంతకాలంగా టీనేజ్ విద్యార్థులే ఎక్కువగా మత్తుపదార్థాల బారిన పడి మా దగ్గరికి ట్రీట్మెంట్‌కు వస్తుండడం బాధాకరం.. దేశానికి వెన్నుముకైన యువతే డ్రగ్స్ బారినపడి తల్లిదండ్రులకుతీరని శోకం మిగిలు స్తున్నారు. యువత మత్తు పదార్థాలు బారిన పడకుండా ఉండా లంటే ప్రధానంగా తల్లి దండ్రుల స్వీయ పర్యవేక్షణ, పటిష్టమైన పోలీసు యంత్రాంగంతో పాటు నిస్వార్థమైన సమాజం కూడా సహకరిస్తే సాధ్యమవుతుంది.

# అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

*తొర్రూరు,జూలై 13,ప్రభాతవార్త*
రాష్ట్రంలో ఉన్న పరువు అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలను అందజేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు,పెద్ద వంగర,రాయపర్తి,కొడకండ్ల,దేవరుప్పుల,పాలకుర్తి మండలాల్లోని పలు గ్రామాలలో అనారోగ్యానికి గురైన సుమారు 185 మంది బాధితులకు రూ.49 లక్షల4వేలు మంజూరు అయిన చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి పేదవాడికి పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తామన్నారు.గత ప్రభుత్వంలో వచ్చిన చెక్కులు కూడా లబ్ధిదారులకు ఇవ్వకుండా బిఆర్ఎస్ నాయకులు దాచుకున్నారని,కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి అర్హులైన పేదలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు పేదలను ఆదుకోవడం కోసం సిఎం రేవంత్ రెడ్డి లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని అన్నారు.ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.దేశంలో ఎక్కడలేని విధంగా మన రాష్ట్రంలో ప్రజాకర్షణ పథకాలను రూపకల్పన చేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బంగారు తెలంగాణ నిర్మాణం కోసం కృషి చేస్తున్నారని,కాంగ్రెస్ పాలనకు ప్రజల్లో ఆదరణ పెరి గిందని ప్రతిపక్షాలు తమపై దుష్ప్రచారాన్ని మాను కోవాలన్నారు.పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఉండి వారి



సమస్యలు పరిష్కరి స్తానన్నారు.కొంతమంది మీడియా మిత్రులు వాస్తవాలను తెలుసుకొని రాయా లని కోరారు.సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల తరపున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య,వైస్ చైర్మన్ జనిగా సురేందర్ రెడ్డి,బ్లాక్ అధ్యక్షులు జాటోత్ హమ్యా నాయక్,రాపాక సత్య నారాయణ, తొర్రూరు, రాయపర్తి, పాలకుర్తి, దేవరుప్పుల,కొడకండ్ల,పెద్దవంగర మండ లాల అధ్యక్షులు సుంచ సంతోష్, రవీందర్ రెడ్డి,సురేష్ నాయక్,గిరగాని కుమారస్వామి, ముద్దసాని సురేష్,నల్ల శ్రీరామ్,తొర్రూరు పట్టణ అధ్యక్షుడు సోమ రాజ శేఖర్,వార్డు కౌన్సిలర్ లు తూనం రోజా ప్రభుదాస్,భూసాని రాము, దొంగరి రేవతి శంకర్, బిజ్జాల మాధవి అనిల్,కాంగ్రెస్ పార్టీ నాయ కులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, తాజా మాజీ సర్పంచ్లు,ఎంపీటీసీలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## యాదవ మండల యువజన అధ్యక్షునిగా బండారి హర్షిత్

*ఓదెల, ప్రభాత వార్త:*
ఓదెల మండల కేంద్రంలోని అఖిల భారత యాదవ మహాసభ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ యువజన విభాగంలో మండల నూతన కమిటీని ఎన్నుకోగా ఓదెల మండలం యాదవ యువజన నూతన అధ్యక్షునిగా బండారి వర్షిత్ యాదవ్, ఉప అధ్యక్షుడిగా జంగా అజయ్ కుమార్ యాదవ్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ... యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు అట్ల సాగర్ యాదవ్, కొమ్మ సతీష్ యాదవ్, వినిత్ యాదవ్, సాయి మాధవ్, నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తం చిందిన నేషనల్ హైవే

మొదటి పేజీ తరువాయి



నేషనల్ హైవే 163 ఏటూరునాగారం హైవే ట్రీట్ ఫంక్షనల్ సమీపంలో శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోను ఢీకొట్టిన కంటైనర్ రక్తం చిందిన నేషనల్ హైవే ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.





మృతి చెందినవారు వాజేడు గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. వారిలో కాకర్లపూడి సత్యనారాయణరాజు(యర్రబాబు), కాకర్లపూడి సత్యవతి, ఆటోడ్రైవర్ తల్లండి నాగరాజు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. అంజిరెడ్డి అనితలకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో సామాజిక వైద్యశాలకు తరలించారు. వీరు వాజేడు నుండి ఏటూరునాగారం వైపు వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సత్యనారాయణరాజు కూతురు అనితను ఏటూరునాగారంలో వైజాగ్ బస్సు ఎక్కించేందుకు వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కంటైనర్ డ్రైవర్ తప్పించుకుని పారిపోతుండగా జగన్నాధపురం జంక్షన్ వద్ద గ్రామస్తులు అడ్డుకోవడంతో డ్రైవర్ దిగి పారిపోయాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వరుస దొంగతనాలు.. దొరకని దొంగలు

*మానకొండూర్, ప్రభాతవార్త :*
వరుసగా ట్రాన్స్ఫార్మర్లను ఎత్తుకెళ్తున్న దుండగులను పట్టుకోవడంలో పోలీసులు విఫలం అయ్యారని, వారం రోజుల్లో ఆరు ట్రాన్స్ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తకెళ్లడం జరిగిందని, సంబంధిత ట్రాన్స్కో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు దుండగులను పట్టుకోవడం లేదని విద్యుత్ అధికారులు, రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు కరెంటు అందించే రన్నింగ్‌లో ఉన్న ట్రాన్స్ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని విలువగల కాపర్ వైరును వారం రోజులలో 6 ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేసి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఘటన మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రైతులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గట్టుదుద్దెనపల్లి సరిహద్దుగల పెంచాలపల్లి-గంగిపల్లి గ్రామ సరిహద్దులో గల బండ సంపత్‌రెడ్డి పొలం వద్ద రెండు ట్రాన్స్ఫార్మర్లు, అలాగే గ్రామ సబ్‌స్టేషన్ వెనకాల ఒక ట్రాన్స్ఫార్మర్, మూడుచోట్ల 6 ట్రాన్స్ఫార్మర్లను ఈనెల 6నుండి 12వ తేదీ వరకు గుర్తుతెలియని దుండగులు రైతులకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఆరు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల(25కెవిఏ)విద్యుత్ వైర్లను చాకచక్యంగా దుండగులు కట్ చేసి ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని విలువ కలిగిన కాపర్ వైరు ఎత్తుకెళ్లారని, ఒక్కో ట్రాన్స్ఫార్మర్‌లోని కాపర్ విలువ సుమారు రూ.85వేలు ఉంటుందని చెంజర్ల ఏఈ మెరుగు రమేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అసలే వర్షాలు లేక పంట సాగుకు నీరులేక రైతులు నాన కష్టాలు పడుతున్న తరుణంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల గుర్తు తెలియని దుండగులు దొంగతనాలకు పాల్పడడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కారం కోసం కృషి చేయాలని పలు గ్రామాల రైతులు గ్రామస్తులు కోరుతున్నారు.



# విలీన పంచాయతీల్లో తీరని సమస్యలు

## -మున్సిపాలిటీలోకి మారినా అభివృద్ధి నిల్
## -సీసీరోడ్లు, మురుగుకాల్వలు లేక ఇక్కట్లు

పరకాల- ప్రభాతవార్త:

మున్సి పాలిటీలో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధి పనులు లేక ప్రజలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు మురుగు కాల్వలు లేక ఇక్కట్లు ఎదురవుతున్నాయి. శివారు ప్రాంతాలు కావడంతో తమను పట్టించుకోవడం లేదని ఆయా పంచాయతీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరకాల పురపాలక సంఘంలో సీతారాంపురం గ్రామాన్ని విలీనం చేసి గ్రామ అభివృద్ధిని నాశనం చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదారం గ్రామపంచాయతీగా సీతారాంపురం గ్రామం విలసిల్లింది. ఆ హయాంలోనే గ్రామంలో చాలా అభివృద్ధి పనులు జరిగాయని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం పరకాల పురపాలక సంఘంలో విలీనం చేసి గ్రామాన్ని అభివృద్ధి చెందకుండా పాలకులు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ పనులతో రోడ్లను తవ్వి వాహనాలు జనాలు నడవలేని పరిస్థితి సృష్టించారని అంటున్నారు. గ్రామంలోని అన్ని వీధులు బురదమయంగా మరి జన జీవనానికి శాపంగా మారిందని చెప్తున్నారు.



### -అధికారులు పర్యవేక్షణ కరువు....

అధికారులు పర్యవేక్షణ లేకుండా పర్సేంజేటీలా కోసమే పనిచేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. సీతారాంపురం గ్రామంలో చేపట్టిన మిషన్ భగీరథ పనులు ఎంత మాత్రం నాణ్యత లేకుండా నాసిరకంతో చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఎక్కడ పడితే అక్కడ పైపులు లీకేజి అయి రోడ్ల వెంట నీరు ప్రవహించి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల గ్రామంలోని హనుమాన్ దేవాలయం ముందు మిషన్ భగీరథ పైపు లీకై నీరంతా వృధాగా పోతుంది. అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టినప్పటికి అవి తాత్కాళికంగాప ఉంటున్నాయి. తర్వాత నీటి ప్రవాహ తాకిడికి పైపులు లీకై తాగునీరు వృదా అవుతోంది. సీసీ రోడ్లు పాడైపోయి రాకపోలకు ఇబ్బంది. స్థానిక ప్రజలు నడవాలంటే బురదమయంగా మారి ఇబ్బంది పడుతున్నారు. దీనిపై మున్సి పల్ అధికారులు మరమ్మత్తులు చేపడుతామని చెప్పినప్పటికి సకాలంలో సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. మున్సి పల్ పాలకవర్గం మిషన్ భగీరథ పనులలో జరుగుతున్న లోపాలను ఏనాడు లేవనెత్తకపోవడం గమనార్హం. అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ప్రభుత్వ నిధులను నేలపాలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గ్రామంలోని రహదారులన్నీ మిషన్ భగీరథ పైపుల కోసం తవ్వేసి గాలిక వదిలేస్తున్నారు. సీసీ రోడ్లన్నీ పాడై ప్రజలకు రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు మిషన్ భగీరథ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వ నిధులు వృదా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రాజ్యమేలుతున్న సమస్యలు....

మున్సి పాలిటీలో విలీనం కాకముందు రాజపేట, సీతారంపురం గ్రామాలు ఎలా ఉన్నాయో ప్రస్తుతం కూడా అలాగే ఉన్నాయి. చిన్న వర్షానికే దాదాపు మెజార్టీ వీధులు బురదమయమవుతున్నాయి. చెత్తా చెదారంతో నిండి అపరిశుభ్రత నెలకొంటోంది. విలీన పంచాయతీల కారణంగా పరకాల పురపాలక సంఘంలో వార్డుల సంఖ్య పెరిగింది. అయితే అందుకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్య పెంచకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. రాజుపేట, సీతారంపురం గ్రామాల్లో కనీసం సీసీ రోడ్లు లేక చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదాచారాలు వెళ్లే పరిస్థితి లేదు. అంతేకాకుండా అపరివుభ్ర వాతావరణంలో దోమలు బెడద అధికమైంది. పూర్తిస్థాయిలో వీదిలైట్లు లేవు. పలు చోట్ల మురుగుకాల్వల్లో చెత్తచేరి దుర్వాసన వెదజల్లుతున్నాయి.

## -పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పరపతి సంఘం అధ్యక్షుడు నాగరాజు

ప్రభాతవార్తప్రతినిధి-హన్మకొండ:

పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమన్న విషయాన్ని పరపతి సంఘాలు రుజువు చేస్తున్నాయని పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పొదుపు, పరపతి పరస్పర సహాయక సహకార సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు అన్నారు. మనం అభివృద్ధి చెండంతో పాటు మన తోటి వారు కూడా అభివృద్ధి చెందేలా ఇవి ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పరపత సంఘం సర్వసభ్య సమావేశం శనివారం హంటర్ రోడ్డులోని దివీవర్స్ హెల్వేర్ బోర్డు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల నాగరాజు మాట్లాడుతూ సభ్యుల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని రానున్న తొమ్మిది నెలల్లో సంఘం లావాదేవీలను స్ట్రీమ్ లైన్ చేయడంతో పాటు రానున్న ఐదో వార్షికోత్సవంలో పూర్థి స్థాయి వార్షిక



నివేదికలను సమర్పిస్తామన్నారు. సంఘం ఉపాధ్యక్షులు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ సంఘం పురోగాభివృద్ధిలో పద్మశాలి జర్నలిస్టులందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే సంఘం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

# ఆర్టీసి కార్మికుల సమస్యలపై అతిత్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తాం

## -టీఎంయూ ర్రాష ప్రధాన కార్యదర్శి ఈ.అశ్వద్ధామరెడ్డి

ప్రభాతవార్త-బాలసముద్రం:

ఆర్టీసి కార్మికుల సమస్యలపై అతి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్మెంట్ తీసుకొని టిఎంయూ రాష్ట్ర నాయకత్వం సీఎంను కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ.అశ్వద్ధామరెడ్డి అన్నారు. హన్మకొండలోని హరిత హోట్‌లో ఆర్టీసి రీజినల్ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మికులు ధైర్యంగా ఉండాలని మనో నిబ్బరాన్ని కోల్పోవద్దని అన్నారు. సాధ్యమైనంత తొందరగా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వం పనిచేస్తుందని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కాస్త ఓపిక సహనం వహించాలని కార్మికులను కోరారు. అధికారుల వేధింపులతో కొంత మంది సహనం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కార్మికులకు అండగా తెలంగాణ మజ్దూర్ యూనియన్ అన్ని వేళలా ఉంటుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని డిపోలలో కండక్టర్లు, డ్రైవర్లు అధికారుల వేదింపులపై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఇకనైనా కార్మికులు ధైర్యంగా ఉండాలని అతి త్వరలో ఆర్టీసి కార్మికులు సమస్యలపై ప్రభుత్వంతో చర్చిస్తామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర నాయకులు రాజలింగం, సురేష్‌రాజు, పి.లక్ష్మయ్య, ఎంఆర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, చొల్లేటి కిరణ్, ఆర్‌వి గోపాల్, ఎస్‌వై రెడ్డి, ఎంఎస్‌రావు, పబ్బాల వెంకటేశ్వర్లు, రవీందర్, ఎస్‌కేవై పాషా, బిఆర్ కుమార్, అశోక్‌రెడ్డి, ఎల్‌ఎల్ పత్తి, పాణి, సతీష్, వెంకన్న, మల్లికార్జున, జి.ఆర్‌స్వామి, చంద్యా, మల్లయ్య, తదితరులతో పాటు 9 డిపోల నుండి, ఆర్‌ఎం ఆఫీసు నుండి సుమారు వంద మంది కార్మికులు పాల్గొన్నారు.






## మృతుడి కుటుంబానికి సాయం

గూడూరు, జూలై 13, ప్రభాతవార్త

మండలంలోని వెంగంపేట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన అంగోతు ఈర్య అనారోగ్యంతో మృతి చెందగా దహన సంస్కార ఖర్చుల కొరకు ఆ గ్రామస్తుల కొందరు తమ వంతు సాయమందించారు. గ్రామానికి చెందిన కుందూరు శోభన్‌రెడ్డి, కట్ల విష్ణుల ఆధ్వర్యంలో వారి బృందం కలిసి రూ.7వేలను శనివారం అందజేసారు. ఈ కార్యక్రమంలో బొమ్మగాని దుర్గయ్యచ బొడ్డు సూర్యనారాయణ, టి రాఘవరెడ్డి, ఎ యాదగిరి, చక్ర, మంగీలాల్, సాయిలు, బిక్కు, సంతోష్ పాల్గొన్నారు.

## గౌడ కమ్యూనిటి హాల్‌కు ఆర్థిక సహాయం

కేసముద్రం రూరల్,జూలై13,ప్రభాతవార్త



మండలంలోని ఇంటికన్నె గ్రామంలో గౌడసంఘం కమ్యూనిటి హాల్ నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మేరకు శనివారం హైద్రాబాద్‌లోని తన కార్యాలయంలో గౌడసంఘం నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంధసిరి శ్రీనివాస్, కారుపోతుల యాకయ్య, ముంజ కుమారస్వామి, చిర్ర శ్రీధర్, నలమాస సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

కేసముద్రం రూరల్,జూలై13,ప్రభాతవార్త



జ మండలంలోని రంగాపురం శివారులో అటవీప్రాంతంలో రాజీవ్‌నగర్ లకావత్ రెడ్యాకు చెందిన ఆవు విద్యుత్‌షాక్ గురై మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుడు రెడ్యా తెలిపిన వివరాల ప్రకారం తన పశువులను అటవీప్రాంతంలో మెపుకొని తిరిగి వస్తున్న క్రమంలో సాయంత్రం తెగిపడి ఉన్న విద్యుత్ తీగెలకు ఆవు తగులడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ 40వేలు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

## కుడా చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు

ప్రభాతవార్తప్రతినిధి-హన్మకొండ:

కూడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంక్రటామ్‌రెడ్డిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు రావు అమరేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

**-40 లీటర్ల నాటుసారా ధ్వంసం**

**-1200 లీటర్ల చక్కెర పానకం ధ్వంసం**

**-9మంది నాటుసారా నిర్వాహకుల అరెస్ట్**

**-12కేసుల నమోదు**

*మహాముత్తారం, జూలై 13, ప్రభాతవార్త*

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని మహాముత్తారం తండా, బోర్లగూడెం, గాజరాంపల్లి, పెగడపల్లి, యామన్‌పల్లి గ్రామాలలో నాటు సారాయి స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ అధికారులు శనివారం తెలిపారు. నాటుసారా నిర్మూలన స్పెషల్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ కమీషనర్ ఆఫ్ వరంగల్ డివిజన్, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ వరంగల్ డివిజన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి యం.లింగాచారి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇట్టి దాడుల్లో 12కేసులు నమోదు చేయడంతో పాటు 9మంది నాటు సారా నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 40లీటర్ల నాటుసారాను స్వాధీన పర్చుకొని, 1200లీటర్ల చక్కెర పానకంను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల్లో నాటుసారాయి



అనార్థలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాలలో ఎవరైనా నాటుసారా అమ్మినా, తయారు చేసిన, రవాణా చేసిన చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఈదాడుల్లో వరంగల్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్. నాగేశ్వర్‌రావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ ఎస్.రాజసమ్మయ్య, వరంగల్ ఎన్ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఎన్.రజితతో పాటు కాటారం ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ బి.కిష్టయ్య, ఎక్సైజ్ సిబ్బంది వెంకటరాజు, కోటేశ్వర్, అనూష, బాలు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.




## గట్టయ్యకు రూ.5వేల ఆర్థిక సహాయం

*చిట్యాల, జూలై 13, ప్రభాతవార్త*



మండలకేంద్రానికి చెందిన గీతా కార్మికుడు గుర్రపు గట్టయ్యకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఛైర్మన్ అయిలి మారుతి ఆర్థిక సహాయాన్ని అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలకేంద్రానికి చెందిన గట్టయ్య తాటిచెట్టు నుండి పడి తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఛైర్మన్ అయిలి మారుతి గట్టయ్య పరిస్థితిని తెలుసుకొని రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వర్కింగ్ ప్రసిడెంట్ సాంబరాది పోశన్న, మండల ఇంచార్జ్ రాజు నాయక్, కుటుంబ సభ్యులు, గీతా కార్మికులు ఉన్నారు. తమ పరిస్థితిని గ్రహించి ఆర్థిక సహాయాన్ని అందించిన ఫౌండేషన్‌కు గట్టయ్య, అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని గౌడ సంఘం నాయకులు కోరుతున్నారు.

## ఐత ప్రకాష్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

*మల్హర్‌రావు, జూలై 13, ప్రభాతవార్త*



మండలం లోని వల్లెంకుంట గ్రామానికి చెందిన ఐత ప్రకాష్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటి సారిగా జిల్లాకేంద్రమైన భూపాలపల్లికి విచ్చేసిన సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల వాసికి రాష్ట్ర స్థాయి పదవిలో అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో తాడిచర్ల మాజీ ఉపసర్పంచ్ ఇందారపు చంద్రయ్య, నాయకులు బొబ్బిలి రాజు, ధనపునేని సురేష్ రావు, అర్రి ఉదయ్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మావురపు వెంకన్న, బూత్ కమిటీ అధ్యక్షులు కన్నూరి అశోక్, మాజీ వార్డు మెంబర్ గాజు శ్రీనివాస్, దొగ్గేల సంపత్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం..

**-ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు అంతరాయం**

**-విద్యుత్ శాఖ ఇంచార్జ్ ఏఈ ఒర్రె కొమురయ్య వెల్లడి**

*మహాముత్తారం, జూలై 13, ప్రభాతవార్త*

వ్యవసాయ, గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్‌ను అందించడం కోసం మహాముత్తారం సబ్‌స్టేషన్‌లో రెండవ 33/11కేవి పవర్ ట్రాన్స్‌ఫార్మర్, 11కేవీ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇంచార్జ్ ఏఈ ఒర్రె కొమురయ్య శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే 11కేవీ మిడిల్ ఫోల్ లాంగ్ లెన్త్‌లైన్ వర్క్, విద్యుత్ లైన్‌లో కంట్రోల్ ఏ,బి స్విచ్‌లు ఏర్పాటు చేసి వాటివల్ల లైన్‌లో ఏమైనా బ్రేక్‌డౌన్ జరిగినప్పుడు త్వరగా గుర్తించి వినియోగదారులకు తక్కువ సమయంలో విద్యుత్ పునరుద్ధరించడం కోసం పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. కావున నేడు(ఆదివారం) ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు మహాముత్తారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలైన మహాముత్తారం, ములుగుపల్లి, పోలారం, వజినేపల్లి, మహబూబ్‌పల్లి, స్థంభంపల్లి(పీకే), కొర్లకుంట, మాదారం, జీలపల్లి, యామన్‌పల్లి, నిమ్మగూడెం, సింగంపల్లి, యత్నారం గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లుతుందని వారు తెలిపారు.

## నేడు సొసైటీ ఛైర్మన్ ఎన్నిక

*మల్హర్‌రావు, జూలై 13, ప్రభాతవార్త*

మండలకేంద్రమైన తాడిచర్ల ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో నేడు(ఆదివారం) నూతన ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా సహకార అధికారిణీ శైలజ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులైన డైరెక్టర్‌లు ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియకు హాజరు కావాలని గతంలోనే నోటీసులు జారీ చేయడం జరిగిందని వారు తెలిపారు. గతంలో ఛైర్మన్ పదవిలో ఉన్న వ్యక్తిపై అనర్హత వేటుపడడంతో ఖాళీ అయిన ఛైర్మన్ పదవి కోసం నేడు ఎన్నిక జరగనుంది. ఇది ఇలా ఉండగా సంవత్సర కాలంగా అనేక మలుపులు తిరిగిన సొసైటీ రాజకీయం నేడు జరిగే ఎన్నికలో ఛైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే మరి..!

# మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

**-కాటారం ఎస్సై మ్యాక అభినవ్**

*కాటారం, జూలై 13, ప్రభాతవార్త*

మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కాటారం ఎస్సై మ్యాక అభినవ్ అన్నారు. శనివారం సాయంత్రం కాటారం మండలకేంద్రంలోని గారెపల్లి ముఖ్య కూడలిలో వాహన తనిఖీలను సిబ్బందితో కలిసి నిర్వహించారు. రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తున్న మైనర్లను గుర్తించి నాలుగు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. అదేవిధంగా 8రాంగ్‌రూట్ డ్రైవింగ్ కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.



ఈసందర్భంగా ఎస్సై మ్యాక అభినవ్ మాట్లాడుతూ..తల్లిదండ్రులు వారి పిల్లలకు ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా వాహనాలు ఇస్తున్నారని, దీంతో వారు అవగాహన లేక రోడ్డు మార్గంలో రాష్ డ్రైవ్‌తో పాటు రాంగ్‌రూట్‌లలో వాహనాలు నడిపి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. సరదా కోసం, పిల్లలు మారం చేస్తారనే కారణంతో వాహనాలు వారికి ఇస్తూ వారి ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని, అట్టి ప్రమాదాలకు మైనర్ పిల్లల తల్లిదండ్రులే ఒక రకంగా కారణంగా చెప్పవచ్చని అన్నారు. కావున తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా, ప్రమాదాలకు కారకులు కాకుండా చూసుకోవాలని సూచించారు. ఎవరైనా మైనర్లు వాహనాలు నడిపితే మోటర్ వెహికల్ యాక్ట్ ప్రకారం చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్సై అభినవ్ హెచ్చరించారు.

## కేటీపిపి 500మెగావాట్ల కేంద్రంలో ప్రారంభమైన ఓవరాలింగ్ పనులు

**-సుమారు నెలరోజుల పాటు ప్లాంట్‌లో ఓవరాలింగ్ పనులు**

*గణపురం, జూలై 13, ప్రభాతవార్త*

గణపురం మండలంలోని చెల్పూర్ శివారులో గల కాకతీయ థర్మల్ విద్యుత్‌కేంద్రంలో 500మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని జెన్‌కో అధికారుల ఆదేశాల మేరకు నిలిపివేశారు. ప్రతి సంవత్సరం ప్రాజెక్టులో నిర్వహించే ఓవరాలింగ్ పనులను ప్రారంభించాలని పైఅధికారుల నుండి ఆదేశాలు రావడంతో శుక్రవారం మొదటి దశ విద్యుత్ ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు. సుమారు నెలరోజుల పాటు ప్రాజెక్టులోని బాయిలర్, గ్రిడ్ విడిభాగాలు, వాటర్ ప్లాంట్, ప్లాంట్ టర్బన్ తదితర యంత్రాల పనితీరును చక్కదిద్దే పనిలో నిమగ్నమైనట్లు తెలిపారు.



# గీతా కార్మికుడు గట్టయ్య పరిస్థితి పట్టేది ఎవరికీ..!?

**-ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు**

*చిట్యాల, జూలై 13, ప్రభాతవార్త*

మండలకేంద్రానికి చెందిన గీతా కార్మికుడు గుర్రపు గట్టయ్య ధీన పరిస్థితిపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆయన కుటుంబం మరింత కృంగిపోతుంది. గుర్రపు గట్టయ్య అనే గీతా కార్మికుడు ఏడాదిన్నర క్రితం తాడిచెట్టు పైనుండి పడి తీవ్రంగా గాయపడి, నడుము పూస, రెండు కాళ్లు స్పర్శ కోల్పయి మంచానికే పరిమితమై జీవచ్ఛవముల పడి ఉంటూ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఈవిషయమై 'ప్రత్యేక కథనాన్ని' ప్రచురించిన విషయం తెలిసిందే. ఆపదలో ఉన్న మనిషిని ఆదుకోవాలని, అప్పుడే మానవ జన్మకు సార్థకత చూకూరు తుందని మహనుభావులు, శాస్త్రాలు చెబుతున్నాయి. కుటుంబ పెద్ద ప్రమాదానికి గురై దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడటం పలువురి మనుషులను కలచి వేస్తుంది. సాటి మానవుడికి సహాయం చేయాలని, ఆతని కుటుంబానికి మనుషులంతా అండగా నిలవాలని



ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. అతని ధీనస్థితిని గ్రహించిన ఇద్దరు పిల్లల చదువులకు దూరమై కూలీ బాట పట్టారు. తల్లీతో కలిసి కూలీ పనులకు వెళ్లడం విచారకరం, ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి అతనిని, అతని కుటుంబాన్ని ఆర్థికవగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతలు స్పందించి 9951234108 నంబర్‌కి ఫోన్‌పే ద్వారా ఆర్థిక సహాయం అందించాలని గౌడ సంఘం నాయకులు కోరుతున్నారు.

# ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి !

**పాఠశాలల్లో స్కావెంజర్లను వెంటనే నియమించాలి !!**

**విద్యావాలంటీర్లను నియమించి బదిలీ ఐన ఎస్.జి.టి.లను వెంటనే విడుదల చేయాలి !!!**

**టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి. నాగిరెడ్డి**



*హనుమకొండ ఎడ్యుకేషన్, జులై 13, ప్రభాతవార్త:*
తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా కమిటి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ముత్యాల రఘుపతి అధ్యక్షతన శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సుబేదరిలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయనైనది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 25 సంవత్సరాలకు పైగా సర్వీస్ చేసినప్పటికిని పదోన్నతులు పొందకుండా అలాగే రిటైర్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలన్నింటికీ పి.ఎస్.హెచ్.ఎం. పోస్టులను మంజూరు చేసి ఎస్.జి.టి.లకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెకండరీ గ్రేడు ఉపాధ్యాయుల చేత పాఠాలు చెప్పనివ్వకుండా యు డైస్ నివేదికలు, ఆన్లైన్ నివేదికలు, ఎఫ్ఆర్ఎస్, మధ్యాహ్న భోజనము, అల్పాహారము, రాగి జావ పంపిణీ, లాంటి పనులకు సంబంధించిన రికార్డులు రాసే పనులు చెప్పుతూ క్లరికల్ వర్క్‌కే పరిమితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తరగతికో ఉపాధ్యాయుడు లేకపోవడం ఒక్కో పాఠశాలకు ఒకరిద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడం, పని భారం అధికంగా ఉండడం వల్ల బోధనకు ఆటంకం కలిగి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందకుండా నష్టపోతున్నారని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు తరగతికొక టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి అతిథిగా హాజరైన టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు అన్ని పాఠశాలలకు స్కావెంజర్లను వెంటనే నియమించి, పాఠశాల పరిశుభ్రతను కాపాడలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో బదిలీ పొందిన ఎస్.జి.టీ.లను విడుల చేయలేదని వారి స్థానంలో విద్యావాలంటీర్లను నియమించి వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగులో ఉన్న టీచర్ల వివిధ రకాల బిల్లులను మరియు డి.ఏ.లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిషాల సత్యనారాయణ, టిపీటీఎఫ్ సీనియర్ నాయకులు బిల్లా సుబ్బారావు, రాష్ట్ర కౌన్సిలర్ బత్తిని శ్రీరామాంజనేయులు, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జగపతిరావు, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రగిరి లక్ష్మయ్య, ఇప్పకాయల కుమారస్వామి జిల్లా కార్యదర్శులు గొడిశాల రమేష్, చక్రు నాయక్, వరంగల్ జిల్లా పూర్వ ప్రదాన కార్యదర్శి బీమల్ల సారయ్య, మండల కొమురయ్య, లకుంభా శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

## కేయూ హాస్టల్‌లో జరిగే ప్రమాద ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలి

*ఎడ్యుకేషన్ కేయూ, జూలై 13 ప్రభాతవార్త :*



గత కొంతకాలంగా కేయూ పోతన హాస్టల్‌లోని వివిధ రూములలో పైపెచ్చులు ఊడి విద్యార్థినిలపై పడి తీవ్ర గాయాల పాలవుతున్నా ముందస్తుగా ప్రమాదాలు జరగకుండా అరికట్టే చర్యలు తీసుకోవడంలో సంబంధిత యూనివర్శిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, కేయూ అధ్యక్షులు అశోక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం కేయూలోని పోతన హాస్టల్‌లోని పెచ్చులూడిపోయిన రూములను పీడీఎస్‌యు ప్రతినిధి బృందం పరిశీలించి విద్యార్థినిలకు మనోధైర్యాన్ని కలిగించారు. ఈసందర్భంగా నరసింహారావు అశోక్ మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి తల్లిదండ్రులను వదిలిపెట్టి ఉన్నత విద్య అభ్యసించడానికి కేయూకు వచ్చిన విద్యార్థినిల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత యూనివర్శిటీ అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే యూనివర్శిటీ అధికారులు హడావిడి చేస్తున్నారని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారే తప్ప ఆచరణలో కనీసం హాస్టల్స్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని తెలిపారు. యూనివర్శిటీ అధికారుల నిరంతర పర్యవేక్షణ లోపం వల్లనే ఇలాంటి ప్రమాద ఘటనలు జరుగుతున్నాయన్నారు. హాస్టల్స్ లో జరిగే ప్రమాదాల వలన విద్యార్థినిలకు ఏదైనా జరగరానిది జరిగి ప్రాణ నష్టం సంభవిస్తే దానికి యూనివర్శిటీ అధికారులు,రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు యూనివర్శిటీ అభిరామ్ రమేష్, పృధ్వి, నరేష్, అనూష, అఖిల, హైమ, పూజిత, సోనీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్శిటీలో కొండచిలువలు

*ఎడ్యుకేషన్ కేయూ, జూలై 13 ప్రభాతవార్త :*



కాకతీయ యూనివర్శిటీ వివేకానంద రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ సమీపంలో కొండచిలువ తిరుగుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కూడా పరీక్షల విభాగం వెనుకాల కూడా కొండచిలువలు తిరిగాయని, వర్షాలు పడ్డ తరువాత మళ్లీ కొండ చిలువలు కనపడడం వలన విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు.

## రెండు జిల్లాలను వరంగల్ జిల్లాగా మార్చండి

*ప్రభాతవార్త ప్రతినిధి-హన్మకొండ:*



రెండు జిల్లాలను వరంగల్ జిల్లా మహానగరంగా మార్చి అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్ళాలని రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు మల్లారెడ్డి, అంబయ్య, బుచ్చిరెడ్డి రాజన్నలు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే వరంగల్ మహానగరంగా ఎదిగి హైదరాబాద్ తర్వాత అతిపెద్ద అభివృద్ధి కేంద్రంగా ఏర్పడుతుందని నాయకులు చేసిన ప్రచారానికి తెలంగాణ ఉద్యమకారులు, వరంగల్ యువత ప్రజలు సంతోషపడి ఆశలు పెంచుకున్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కల్వకుంట్ల పాలనలో వరంగల్‌ను మరి ఆరు ముక్కలు చేసి దాని చారిత్రక నేపథ్యాన్ని సమాజం యొక్క భౌగోళిక ఐక్యతను అభివృద్ధి క్రమాన్ని రాజకీయం చైతన్యాన్ని సాంస్కృతిక గంభీరత్వాన్ని ధ్వంసం చేసి అశాస్త్రీయ చర్యకు పాల్పడి ముక్కలుగా విభజించి ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేయడం జరిగిందని సభ తీర్మానించింది. వరంగల్ నగరం ఉనికిని ధ్వంసం చేసి ఒక రాజరిక పాలనను అమలు చేసే కుట్ర పన్నారని సభ అభిప్రాయ పడింది. కేవలం ఒక నాయకుని యొక్క వ్యాపార ఆర్థిక రాజకీయ ప్రయోనాలను దృష్టిలో పెట్టుకొని విభజించడం జరిగిందని ప్రజలు ఉద్యమకారులు ఆందోళన చేసినప్పటికి బారాసపాలనకులు పట్టించుకోలేదని, జిల్లా విభన కాలంలో పౌర సమాజం నిరసన వ్యక్తం చేసినప్పటికి పాలకులు పట్టించుకోకుండా పెడచెవిన పెట్టడం జరిగిందని ఆవేదన చెందారు. ఈ రోజు వరంగల్ పోచంమైదాన్ రత్న హోటల్‌లో హాల్లో జరిగిన పౌర సభలో అనేకమంది పౌరులు వరంగల్ నగరాన్ని విభజించడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన చెందారు. గత పది సంవత్సరాలలో కరీంనగర్, ఖమ్మం, సిద్దిపేట, నగరాల కంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు జయశంకర్, భూపాలపల్లి మల్బాబాదు జిల్లాలు రాష్ట్రంలోనే క్రింది స్థాయిలో పడిపోయినాయని ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. ఈ ఉమ్మడి జిల్లాను ట్రైసిటీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వారు కోరారు.

## శాట్ చైర్మన్‌ను అభినందించిన డీవైఎఫ్‌వో

*ప్రభాతవార్త- సుబేదారి:*

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ(శాట్) చైర్మన్‌గా నూతనంగా బాధ్యలు చేపట్టిన కే.శివసేనారెడ్డిని హనుమకొండ జిల్లా క్రీడలు, యువజన అధికారి(డివైఎఫ్ఓ) గుగులోతు అశోక్‌కుమార్ అభినందించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శనివారం శివసేనారెడ్డి శాట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. శివసేనారెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.




## ఎమ్మెల్యేకు తెలియకుండా కొంతమంది అత్యుత్సాహం ప్రదర్శించారు

**- ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు**

*రాయపర్తి, జూలై 13 ప్రభాతవార్త :*



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వద్ద ఉన్న కొందరు అనుచరులు అత్యుత్సాహం ప్రదర్శించి పోలీసులతో కొట్టించారని ఎల్‌హెచ్‌పీఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన సామాజిక వర్గానికి చెందిన తనపై వాట్సప్‌లో చేసిన పోస్టు కారణంగా ఎమ్మెల్యేకు నీవు ఎదురుచెపుతావా అని ఎమ్మెల్యే వద్ద ఉండే కొందరు అనుచరులు అత్యుత్సాహంతో తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మొద్దుకు ఎక్కించి కొట్టించారని తెలిపారు. కాగా, ఈవిషయం ఎమ్మెల్యేకు తెలియకుండా ఎమ్మెల్యేవద్ద ఉండే అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. వీరివల్ల కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి అప్రతిష్ట తెచ్చేవిధంగా పాల్పడుతున్నారన్నారు. ఈవిషయం ఎమ్మెల్యేకు ఆలస్యంగా తెలిసి బాధితుడినైన తనను ఓదార్చి మా కుటుంబంలో ఒకరివని అన్నారు. నీపై దాడికి పాల్పడిన వారిని అలాగే బెదిరింపులకు గురిచేసిన వారిని తప్పకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని సురేష్‌బాబు తెలియచేశారు.

## కేయూలో పీజీసైన్స్ తరగతుల ప్రారంభోత్సవం

*ఎడ్యుకేషన్ కేయూ, జూలై 13 ప్రభాతవార్త :*

కేయూ దూరవిద్యాకేంద్రం పీజీసైన్స్ కోర్సుల మొదటి సెమిస్టర్ తరగతులు శనివారం ప్రారంభించారు. జంతుశాస్త్ర విభాగ సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన కేయూ రిజిస్ట్రార్ ప్రొ.మల్లారెడ్డి మాట్లాడుతూ కేయూలో ఈ సంవత్సరం దూర విద్యాకేంద్రం పీజీ కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్యచాలా పెరిగిందని, జువాలజీ,బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ గణితశాస్త్రం లాంటి పీజీ కోర్సులకు త్వరలో కోర్సు మెటీరియల్ కూడా అందివ్వనున్నారని తెలిపారు. విద్యార్థులందరూ కేయూలో నిర్వహించే తరగతులను ఉపయోగించుకోవాలన్నారు. దూరవిద్యాకేంద్ర సంచాలకులు ప్రొ.వి.రామచంద్రం మాట్లాడుతూ థియరీ తరగతులకు విద్యార్థులు షెడ్యూల్ ప్రకారం హాజరు కావాలని ఆ తరువాత ప్రాక్టికల్స్ కూడా విద్యార్థుల కొరకు నిర్వహిస్తామని అన్నారు. యూజీసీ డేబ్ సూచనల మేరకు మొట్టమొదటి సారిగా కేయూలో సెమిస్టర్ విధానం ప్రవేశ పెట్టామని అన్నారు. దూరవిద్యకేంద్రం సైన్స్ కోర్సుల సహా సంచాలకులు డాక్టర్ వెంకట గోపినాథ్ మాట్లాడుతూ రెగ్యులర్ కోర్సులకు ధీటుగా దూరవిద్యావిధానంలో క్లాసుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని త్వరలో స్టడీ మెటీరియల్‌ను కూడా అందివ్వనున్నామని అన్నారు. డాక్టర్ వెంకట గోపినాథ్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యమ్రంలో సైన్స్ విభాగాల విభాగ అధిపతులు డా.భారవిశర్మ, డా.మంజుల, డా.ఇస్తారి, డా.లలితకుమారి, డా.ముస్తఫా, డా.జ్యోతి, డా.హన్మంతు, ఆయావిభాగాల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు పాల్గొన్నారు.



# కలెక్టర్ గారు కేన్ భూముల కబ్జాను నియంత్రించరా !



కబ్జా కోరల్లో పాలంపేట కేన్ భూములు
పట్టించుకోని ఫారెస్టు ఉన్నతాధికారులు
42 ఎకరాలకు మిగిలింది 15 ఎకరాలే
అక్రమంగా కేన్‌ను నరుకుతున్న కబ్జాకోరులు
అధికారుల నిర్లక్ష్యంతో జీవవైవిధ్య పరిరక్షణకు
తూట్లు పొడుస్తున్న కబ్జాకోరులు, అటవీశాఖ
ములుగు జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి పెట్టాలి
ప్రపంచ వారసత్వ సంపదను కాపాడుకోవాలి





**ములుగు, జూలై 13, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోనే అరుదైన వృక్షజాతి సంపద కేన్ ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట సమీపంలోని రామప్ప దేవాయలం వద్ద ఉంది. కొంత మంది కేన్ (సావుతీగ) భూమిని ఆక్రమించుకొని కబ్జా చేయడంతో అరుదైన వృక్ష సంపద కలిగిన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుంది. కొత్తగా వచ్చిన ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ దృష్టి పెట్టి తిరిగి సర్వే చేయించి భూమిని గుర్తించి తిరిగి ట్రెంచ్ కొట్టించి, ఇనుప కంచె రక్షణగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. కేన్ యొక్క శాస్త్రీయ నామం రొటామస్ కలాంగో స్థానికంగా దీనిని ప్రజలు సావుతీగగా పిలుపుచుకుంటారు. అయితే ఈ అరుదైన జాతి వృక్ష సంపద పాలంపేట ఏరియాలో సర్వే నెంబర్లు 287 లో 7.31 ఎకరాలు, 288 లో 0.37 ఎకరాలు, 289 లో 2.13 ఎకరాలు, 291 లో 1.15 ఎకరాలు, 292 లో 26.38 ఎకరాలు మరియు నాలా 5.10 ఎకరాలు ఉంది. ఈ భూమిని అప్పట్లో 1974 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్టేట్ బయో డైవర్సిటీ బోర్డు ద్వారా ప్రొటెక్టెడ్ ఏరియాగా ప్రకటించారు. అలాంటిది అధికారుల నిర్లక్ష్యం వలన కేన్ కలిగిన భూమి కబ్జా కోరుల కబంధ హస్తాలలోకి వెళ తుండటంతో పర్యావరణ పరిరక్షకులు, జీవీ వైవిధ్య పరిరక్షకులు ఆందోళన చెందుతున్నారు. రొటామస్ కలాంగో శాస్త్రీయ నామం (కేన్) సావుతీగా పేరున్న ఈ వృక్ష జాతి కబ్జాకోరుల కారణంగా అంతరించి పోయే దశకు చేరుకుంది. ఒకప్పుడు 54 ఎకరాలు ఉన్న కేన్ భూమి, కొంత మంది ఆక్రమించుకోవడం వలన 2014 లో అప్పటి మంత్రి అజ్మీర చందూలాల్ ఫారెస్టు మరియు రెవెన్యూ అధికారులతో జాయింట్ సర్వే చేయించగా 42 ఎకరాలుగా గుర్తించి ఈ భూమి చుట్టూ ట్రెంచ్ కొట్టారు. భూమిని కాపాడేందుకు ట్రెంచ్ తో పాటు ఇనుక కంచెను ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉండగా ఆ తరువాత అటవీశాఖ అధికారులు పట్టించుకోలేదు. దీనితో కబ్జాదారులు ట్రెంచ్‌ను తొలగించి పూడ్చివేసి తిరిగి భూములను సాగుచేసు కుంటున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఏ కొద్ది ఫారెస్టు భూమిని నరికి ఆక్రమించిన వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకునే అటవీశాఖ అధి.కారులు, ఈ భూముల విషయంలో పట్టించు కోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ భూముల విషయం పై ఓ అటవీశాఖ అధికారి ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ వారిని ఇటు వైపు రాకుండా చూస్తూ కబ్జాకోరుల కొమ్ముకాస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు అరుదైన వృక్ష సంపద కలిగిన ఫారెస్టు భూమిని ఆక్రమించి, దానిని తొలగించి, కాలబెట్టి సాగు చేసి ఆక్రమించడంతో ఈ వృక్ష సంపద రోజు రోజుకు అంతరించి పోతుంది. ములుగు జిల్లా కేంద్రానికి కేవలం 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న పాలంపేట కేన్ ప్రాంతంను జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. కొత్తగా వచ్చిన ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ దీనిపై ఫోకస్ చేసి ఆక్రమిత భూమిని రక్షించి, కేన్ వృక్ష సంపదను కాపాడాలని కోరుతున్నారు. జిల్లాలో డిఎఫ్ఓ, సబ్ డిఎఫ్ఓ, రేంజ్ అధికారులు ఉన్నప్పటికీ వారి పట్టింపు లేని తనంగా కబ్జాకోరులు నిర్భయంగా ఫారెస్టు భూమిని ఆక్రమించి కేన్ వృక్ష సంపదను నరికి భూములను కబ్జా చేసి సాగుచేసుకుంటున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాయలనాకి నిత్యం ఫారెస్టు ఉన్నతాధికారులు తరుచూ వచ్చినప్పటికీ కేన్ ప్రాంతం నుండి చూసుకుంటూ వెళతారు. అయినా దాని విషయాన్ని పట్టించుకోక తమకేమి దీనితో పనిలేదనే విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో కొంత మంది అటవీశాఖ అధికారులు మధ్యవర్తులను ఏర్పరుచుకొని వారి ద్వారా కబ్జాకోరుల నుండి డబ్బులు వసూలు చేసి లంఛాలు తీసుకొని పట్టించుకోవడం లేదనే విమర్శలు సైతం వెల్లువెత్తున్నాయి. కబ్జాకోరులు నిర్భయంగా కేన్ భూములను ఆక్రమించుకొని కేన్‌ను నరికి తగలబెట్టి సాగు చేసుకుంటుంటే ఫారెస్టు అధికారులు పట్టించుకోవడం లేదంటే అనుమానాలు రాకమానడం లేదు. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ వృక్ష సంపద కేవలం రామప్ప సరస్సు పరిసరాలలో మాత్రమే ఉంది. నీరు అధికంగా ఉండే మోరంచల వెంట విపరీతంగా పెరుగుతుంది. రామప్ప చెరువు తూముల ప్రాంతం నుండి పాలంపేట కేన్ ప్రాంతంలో అధిక మొత్తంలో ఉండగా, అక్కడి నుండి మోరంచ వాగు వెంట కొండాపురం మాటు కాలువ బంగ్లాపల్లె చివరి వరకు విపరీతంగా వ్యాపించి ఉంటుంది.

### దీని రైజోమ్ ద్వారానే శాఖీయోత్పత్తి వ్యాప్తి...

కేన్ సావుతీగ రైజోమ్ ద్వారానే శాఖీభవనం చెంది, వరదలో ఎక్కడికి కొట్టుకుపోయి ఆగుతుందో ఆ ప్రాంతంలో గుంపులు గుంపులుగా పెరుగుతుంది. దీని రైజోమ్ నుండి కాండం బలహీనంగా తీగా మాదిరి పెరిగి దేహమంతా పదునైన ముళ్లు పెరుగుతాయి. దీనికి కాచే పల్లు పుల్లగా, ఒగరుగా ఉండటంతో ఈ ప్రాంతంలోని ఆయుర్వేద వైద్యులు వీటిని మందుల తయారీలో సైతం వాడుతుండే వారు. అయితే ఈ పండ్లలో సి విటమిన్ అధికంగా ఉండటం వలన తెలిసిన వాళ్లు ఈ పండ్లను తింటూ రోగ నిరోధక శక్తి అధికంగా పెరిగి రోగాల బారిన పడే చాన్స్ తక్కువగా ఉంటుంది. గతంలో ఈ ప్రాంతంలోని ఎరుకల జాతికి చెందిన వారు సావు తీగను తీసి మట్టిని మోసేందుకు వినియోగించే తట్టలు అల్లడానికి వినియోగించి ఉపాధి పొందే వారు. ఇంకొంత మందిని దీనిని వేరే ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకునే వారు. అయితే పాలంపేట లోని కేన్ ప్రాంతంలో విభిన్న జాతుల మొక్కలు సుమారు 125 రకాలు ఉండటం, వివిధ రకాల జంతువులు ఇందులో నివసించడం వలన దీనిని జీవవైవిధ్యం కలిగిన ప్రాంతంగా గుర్తించారు.

### పాలంపేట కేన్ ప్రాంతంలో గబ్బిలాలు...

పాలంపేట సమీపంలోని కేన్ సావుతీగ ప్రాంతంలో వివిధ రకాల వృక్ష జాతులు ఉండటంతో వేలాది గబ్బిలాలు కనిపిస్తాయి. అక్కడ తాని చెట్లు, మద్ది చెట్లు ఉండటంతో గబ్బిలాలు చెట్ల కొమ్మలకు వేలాడి పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. గబ్బిలాలు రాత్రించరులు రోజు రాత్రి పూట సుమారు 10 నుండి 20 కిలో మీటర్ల వరకు సంచరిస్తాయి, ఈ సందర్భంలో అవి వివిధ రకాల క్రిమి కీటకాలను తింటాయి. అందులో కొన్ని క్రిమి కీటకాలు వ్యవసాయ పంటలకు కీడు చేసేవిగా ఉంటాయి. వీటిని గబ్బిలాలు తినడంతో కొంత వరకు పంటలకు మేలు జరిగి పంటల దిగుబడి పెరుగుతుంది.

### కాలువ సాపు పేరుతో కేన్ మొక్కలు ధ్వంసం...

రామప్ప నుండి సాగు నీరు వెళ్లేందుకు నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో తీసిన మోరంచ సాపుతో కేన్ మొక్కలు ధ్వంసం అయ్యాయి. కొద్ది రోజుల క్రితం కేన్ మొక్కలు ఉన్న ప్రాంతంలో నుండి మోరంచ కాలువకు వెళ్లే కాలువను జేసిబి తో షిల్ట్‌తో పాటు పిచ్చి మొక్కలను తొలగించే క్రమంలో కేన్ మొక్కలు వందల సంఖ్యలో నాశనమయ్యాయి. ఈ ప్రాంతంలో జేసిబి వినియోగించకుండా మనుషులతో తీస్తే కేన్ మొక్కలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉండేదని పర్యావరణ వేత్తలు అంటున్నారు. ఇంత జరిగినా అటవీశాఖ అధికారులు అటు వైపు తొంగి చూడక పోకపోవడం ఎంత వరకు సమంజసమని విమర్శిస్తున్నారు.

ములుగు వార్త

## మృతుల కుటుంబాలకు గండ్రకోట పరామర్శ

పలువురి కుటుంబాలకు ఆర్థిక చేయూత
మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం
బిఆర్ఎస్ జిల్లా నాయకులు, గండ్రకోట సుధీర్
సేవా ఫౌండేషన్ ఫౌండర్ గండ్రకోట సుధీర్ యాదవ్



**ములుగు, జూలై 13, ప్రభాతవార్త :** ములుగు మండలం కాశిందేవిపేట గ్రామానికి చెందిన గుండాల రవి, కొండబోయిన మల్లయ్య అలాగే మదనపల్లి గ్రామానికి చెందిన బల్గూరి సత్యలు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు, ములుగు మాజీ ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి భర్త గండ్రకోట సుధీర్ యాదవ్ మృతుల కుటుంబాలకు చెందిన సభ్యులను శనివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తదనంతరం మృతుల కుటుంబాలకు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు, గండ్రకోట సుధీర్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గండ్రకోట సుధీర్ యాదవ్ మాట్లాడుతూ మృతుల కటుంబ సభ్యులు ఎవరు కూడా అధైర్య పడవద్దని, వారికి బిఆర్ఎస్ పార్టీతో అండగా ఉంటుందని అన్నారు. ఎవరికీ ఏ సమస్య వచ్చిన తనను తెలియజేస్తే వారి సమస్యను తాను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. మృతులు అకాల మరణం చెందడం చాలా బాధాకరమని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. ఎల్లవేళల తాను ప్రతి ఒక్క కుటుంబానికి అందుబాటులో ఉంటానని వారి మంచి చెడుల్లో భాగం పంచుకుంటానని ఆయన ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్య క్రమంలో కాశిందేవిపేట బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు డా. అమర్ సింగ్, మాజీ ఎంపీటీసీ స్వామిరావు, కొత్తూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు రామారావు, కవ్వంపల్లి బాబు, భాస్కర్, అంకూస్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే ప్రకటించాలి
టీచర్లకు రూ. 2లక్షలు, ఆయాకు 1 లక్ష చెల్లించాలి
కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రవిగౌడ్

**ములుగు, జూలై 13, ప్రభాతవార్త :** అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు గుండెబోయిన రవిగౌడ్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆఫీస్ దగ్గర అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ సమస్యలు పరిష్కారించాలని చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 8వ రోజుకు చేరింది. అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు తన మద్దతు ఇచ్చి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, జీ.నెం 10 ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని రవి గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మక్క, పద్మరాణి, భాగ్యలక్ష్మీ, మోక్షారాణి, అరుంధతి, ధనలక్ష్మీ, విజయ, రుక్మిణి, సునీత, రమాదేవి, శాంత తదితరులు పాల్గొన్నారు.



# దసరా వరకు జిల్లాకు 30 డీలక్స్, 30 ఎక్స్ ప్రెస్ బస్సులు మంజూరు చేస్తా





బిసి సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

*నల్లగొండ అర్బన్, జులై 13, ప్రభాతవార్త :*

దసరాలోపు ఉమ్మడి నల్గొండ జిల్లాకు 30 డీలక్స్ బస్సులు, 30 ఎక్స్ప్రెస్ బస్సులను మంజూరు చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని నల్గొండ బస్టాండ్‌లో శనివారం ఆయన బస్సు డిపోలో నల్గొండ – హైదరబాద్‌కు ఒక ఏసీ బస్సును, 4 డీలక్స్ బస్సులను, పల్లెవెలుగు బస్సును రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కట్‌పల్లి డిపోకు పునర్ వైభవం తీసుకొచ్చి అక్కడినుండి అన్ని ప్రాంతాలకు బస్సులు నడుపుతామని ఆయన అన్నారు. నల్గొండ నుండి తిరుపతి, హైదరాబాద్‌లకు ఏసీ బస్సులను మంజూరు చేస్తామని రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నష్టాలలో నడుస్తున్న ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు.

ఆర్టీసీ సంస్థను, కార్మికు లను సంరక్షించేందుకు నూతన ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకున్నదని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటైన 48 గంటల లోపే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, నూతనంగా 1000 బస్సులను కొనుగోలు చేశామని తెలిపారు. మరో 1500 బస్సులను కొనుగోలు చేసేందుకు ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. నల్గొండ జిల్లాలో 7 బస్సు డిపోలు ఉన్నాయని, 645 బస్సులు రెండు లక్షల 55000 కిలోమీటర్లు ప్రమాణించి, 3 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జిల్లా పరిధిలోకి వచ్చే నార్కట్‌పల్లి బస్సు డిపోకు పునర్ వైభవాన్ని తీసుకువచ్చి అక్కడి నుండి అన్ని ప్రాంతాలకు బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమంలో భాగంగా 21% డిఎని ఇచ్చామని, 280 కోట్ల బకాయిలలో 80 కోట్లు ఇదివరికే ఇవ్వడం జరిగిదని తెలిపారు. రూ. 200 కోట్లలను ఈ నెలాఖరు నాటికి వారి వారి ఖాతాలలో జమ చేస్తామని మంత్రి వెల్లడించారు. ఆర్టీసీ బలోపేతంలో భాగంగా నూతనంగా 3035 ఉద్యోగాలను భర్తి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసిని ఆపరేషన్ నష్టాల నుండి బయటకు తీసుకువచ్చే విధంగా ప్రభుత్వ సహకారంతో ముందకు నడిపిపిస్తున్నామని చెప్పారు. అన్ని జిల్లాల నుండి హైదరాబాద్‌కు ఏసీ బస్సులు నడపాలని నిర్ణయం తీసు కున్నామని అవసరమైతే అసెంబ్లీ నియోజక వర్గాల నుండి రాష్ట్ర రాజధానికి ఏసీ బస్సులను నడుపుతామని, ముందుగా జిల్లా కేంద్రాల నుండి ఏసీ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు వెల్ల డించారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుండి హైదరాబాద్‌కు ఎలాంటి లోటుపాట్లు లేకుండా బస్సులు నడిపి ప్రయాణికులను సురక్షితంగా చేరవేస్తామని చెప్పారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండవ రోజే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిందని, 60 నుండి 70 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. టీజీ ఆర్టీసీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అప్పుల్లో ఉన్న ఆర్టీసీని పైకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. హైదరాబాద్ తర్వాత ఆరు అసెంబనఈల నియోజకవర్గాలు, 35 లక్షల జనాభాను కలిగి అతి పెద్ద జిల్లాగా నల్గొండ ఉందని, అందువల్ల నల్గొండ జిల్లాకు ప్రత్యేకంగా 25 బస్సులతో పాటు నార్కెట్‌పల్లి ఆర్టీసి డిపోకి పునర్ వైభవం తీసుకురావాలని, ఉమ్మడి నల్గొండ జిల్లా మొత్తానికి 100 బస్సులను మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ ఛైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, ఆర్‌టిసి ఆర్ఎం రాజశేఖర్, డిప్యూటీ ఆర్ఎం శివ శంకర్, ఆర్టీసి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అధికారుల అలసత్వంతో అటకెక్కిన గుట్కాల నిషేధం

-విచ్చలవిడిగా గుట్కా విక్రయాలు

-ఆర్ధికంగా.. ఆరోగ్యంగా చితికి పోతున్న యువత

-తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న తల్లిదండ్రులు

*భువనగిరి రూరల్,ప్రభాతవార్త:*





విద్యార్థులు, యువకులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించక వ్యసనపరులతో స్నేహం చేసి దురాలవాట్లకు దగ్గరై తమ బంగారు భవిష్యత్తును చేజేతలు నాశనం చేసుకుంటున్నారు. తాగుడుకు బానిసై కొందరు, గుట్కాలకు, గంజాయికి బానిసై మరికొందరు ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుని అప్పుల పాల అవడమే గాక ఆసుపత్రుల పాలవుతున్నారు. తమ తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన ఆస్తులు అమ్మి అప్పులు తీర్చుకునే పరిస్థితి ఏర్పడుతుంది. వీటన్నింటికి కారణం చెడు స్నేహాలు, దుర అలవాట్లు, ఈ దురాలవాట్లను దూరం చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన నిషేధ చట్టం అధికారుల నిర్లక్ష్యంతో అటకెక్కుతోంది.

రోజురోజుకు సమాజపరంగా పరిజ్ఞానం పెరుగుతుంటే తామేం తక్కువ అన్నట్లు యువత అపరిపక్వ పరిజ్ఞానంతో సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడు తున్నారు. ఇది గమనించిన తెలంగాణ ప్రభుత్వం గుట్కా, గంజాయి, మాదకద్రవ్యాలను నిషేధిస్తూ మే 30న ప్రకటన చేసినప్పటికీ అధికారులు మాత్రం మాకెందుకులే అన్నట్లు వ్యవ హరిస్తుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయోజకులు కావాలని, తమలా వ్యవసాయం, అడ్డ కూలీలుగా కష్టపడకూడదని రాత్రనకా, పగలనకా, తిండి తిన్న తినకపోయినా కష్టపడి తమ పిల్లలను చదివిస్తున్నారు. ఇవేమీ పట్టనట్లు కొంతమంది వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని అక్రమ వ్యాపారులు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధికారులు సైతం చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో వ్యాపారుస్తులకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. హైదరాబాద్‌కు దగ్గరలో ఉండడం వల్ల భువనగిరి ప్రాంతంలో పలు వార్డుల్లో విచ్చలవిడిగా గుట్కాలు, గంజాయి సిగరెట్లు సైతం కిరాణా షాపులలో, రెస్టారెంట్‌లో నిత్యావసర సరుకులు మారాయని బహాటంగానే చెప్పుకుంటున్నారు. గతంలో పలుమార్లు గంజాయి పట్టుబడినప్పటికీ కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం కాకుండా పోలీసులు గట్టి నిగా ఏర్పాటు చేయాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఎపిటోమ్ వెంచర్‌లో అక్రమంగా గుట్టల బ్లాస్టింగ్

రైతుల పొలాల్లోకి ఎగిరిపడ్డ బండరాళ్లు

పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు



**చౌటుప్పల్, జూలై 13 ప్రభాతవార్త** చౌటుప్పల్ మున్సిపాలిటీలోని తంగపడల్లి గ్రామ పరధిలోని ఎపిటోమ్ వెంచర్‌లో ఉన్న గుట్టలను అక్రమంగా బ్లాస్టింగ్ చేసి తొలగించే పనులు చేపట్టారు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో పెద్ద ఎత్తున రాళ్లు పడి వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ విషయంపై చెరుకు పద్మ పంట దెబ్బతిన్నదని ఆరోపిస్తూ శనివారం పోలీసులకు పిర్యాదు చేశారు. వ్యవసాయ భూముల్లో ప్రమాదకరంగా రాళ్లు పడి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులు ధర్యాప్తు జరుపుతున్నారు.



## నార్కట్‌పల్లి డిపోకు పూర్వ వైభవం కల్పించాలి

*నార్కట్‌పల్లి, జులై 13 ప్రభాతవార్త*



రాష్ట్రంలోనే తొలి బస్‌డిపోగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మింపబడిన నార్కట్‌పల్లి బస్‌డిపోకు పూర్వ వైభవం కల్పించాలని, తద్వారా మండల అభివృద్ధికి, ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి దారి చూపాలని రాష్ట్ర రావాణ మరియు బిసి వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని అందించారు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజి జడ్‌పిటిసి దూదిమెట్ల సత్తయ్యల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శనివారం ఆయనకు వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు.బైపాస్ నిర్మాణం పూర్తయిన తరువాత అసలు గ్రామంలోని బస్టాండ్‌కు బస్సులు రాకపోవండతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు తెలిపారు.అదే విధంగా గత ప్రభుత్వం అనాలోచిత చర్యల కారణంగా బస్‌డిపోను తరలించి కేవలం బస్టాండ్‌కే పరిమితం చేయడంతో బస్సుల రాకపోకలు పూర్తిగా తగ్గిపోయి వివిధ ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణకుల వెతలకు పరిస్కారం చూపాలని కోరారు.బస్‌డిపోను పునరుద్ధరించడంతోపాటు బస్సుల సంఖ్యను పెంచాని కోరారు.కర్యాక్రమంలో నాయకులు వడ్డె భూపాల్ రెడ్డి, కొమ్మనబోయిన మల్లేష్, నరేందర్ రెడ్డి స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.12కోట్లు మంజూరు

**-త్వరలోనే పనులు ప్రారంభిస్తాం..**
**-నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..**
**-భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



*రేగొండ, జూలై 13, ప్రభాతవార్త*


ఈప్రాంత ప్రజల ఇలవేల్పు దైవమైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం మండలంలోని శ్రీ కొడవ టంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.12కోట్ల 15లక్షలు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అందులో భాగం గానే మొదటిసారిగా కొడవటంచ గ్రామంలో సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నర సింహ స్వామి వారి ఆలయ అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12కోట్ల 15లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అట్టి నిర్మాణ పనులను త్వరలోనే టెండర్లు వేసి ప్రారంభిస్తామని అన్నారు. సంవత్సరం తిరిగే లోపు పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. ఆలయంలో విమాన గోపురం, అర్ధమండపం, మహా మండపం పనులను పున:ప్రారంభి చనున్నట్లు తెలిపారు. అద్దా మండపం, అల్వార్ నిలయం, పాకశాల, అన్నదాన సత్రం, క్యూలెన్ల ఏర్పాటు, డ్రైనేజీ, భక్తుల కొరకు కాటేజీలు, సాలహారం, కంపౌండ్ వాల్, ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్, ఆఫీస్ బిల్డింగ్, అర్చకులు ఉండేందుకు వసతి గృహలు, రేగొండ క్రాస్ రోడ్డులో అసంపూర్తిగా ఉన్న ఆర్చి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రూ.59కోట్లతో బుద్దారం నుండి కొడవటంచ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే మంజూరు రాబోతున్నట్లు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అడగగానే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆలయ ఛైర్మన్ ముల్కనూరు భిక్షపతి, ఎన్ఎస్ఆర్ సంస్థల ఛైర్మన్ నాయినేని సంపత్ రావు, నాయకులు గూటోజు కిష్టయ్య, ఎర్రబెల్లి రవీందర్ రావు, పులి తిరుపతి రెడ్డి, పున్నం రవి, బొట్ల తామస్, పట్టెం శంకర్, కోలేపాక సాంభయ్య, ఇప్పకాయల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక పాలనలో పడకేసిన పాలన

**-పేరుకుపోతున్న చెత్తాచెదారం**
**-పంచాయతీ కార్మికులకు అందని వేతనాలు**
**-ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రత్యేక అధికారులు**

*పరకాల- ప్రభాతవార్త:*

గ్రామ పంచాయతీలలో నిధులు లేకపోవడంతో ప్రత్యేక అధికారులు పాలనలో గ్రామాల్లోని పారిశుద్ధ్య పనులు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. గతంలో సర్పంచ్‌లు ఉన్న సమయంలో ప్రభుత్వ నిధులు ప్రతి నెలా స్టేట్ ఫైనాన్స్ నిధులను ప్రతి నెలా మంజూరు చేసేది అదేవిధంగా ప్రభుత్వం మారిన తర్వాత నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రత్యేక అధికారులు నిధులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామపంచాయతీలు నిధులు లేక గ్రామాల్లో అభివృద్ధి జరగక ఎక్కడ చెత్తా అక్కడ పేరుకుపోతూనే ఉంది. గ్రామపంచాయతీలో నిధులు పూర్తిగా సర్పంచ్‌లు లూటీ చేయడంతో ప్రత్యేక పాలన వచ్చిన తర్వాత అధికారులకు ఏం చేయాలో తోచని స్థితి నెలకొన్నది. దాంతో పాటు తెలంగాణలో బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామపంచాయతీలకు నిధులు రాకపోవడంతో ప్రత్యేక అధికారులు జేబులు నుంచి డబ్బులు ఖర్చు చేస్తూ పనులు చేపడుతున్నారు. ఇలా మూడు నాలుగు నెలల నుంచి చేస్తూ ఉన్నా నేటికీ గ్రామపంచాయతీలకు నిధులు రాకపోవడంతో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు డబ్బులు లేక అభివృద్ధి చేయక గ్రామాల్లో చెత్తా, మోరీలలో చెత్త నిండి ఎక్కడి పనులు అక్కడే పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా గ్రామపంచాయతీలో పనులు చేస్తున్న వారికి కనీసం నాలుగు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యేక



అధికారులు చొరవ తీసుకొని పంచాయతీ కార్యదర్శులకు వేతనాలు అందించాలని కార్మికులు కోరుతున్నారు. దాంతో పాటు పంచాయతీ అభివృద్ధికి అధికారులు నిధులు కేటాయిస్తే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధాంగా ఉన్నామని అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికే కొంత మంది పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ నిదులు ఇస్తేనే అభివృద్ధి ఏస్తామని ఉన్నత అధికారులకు తెలపడం జరిగింది. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

# ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్ మేళా

**-పంటమార్పిడితో అధిక దిగుబడులు**
**-జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి మరియన్న**

*మహబూబాబాద్,జూలై13,ప్రభాతవార్త*



పంటమార్పిడితో అధిక దిగుబడులు సాదించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. శనివారం జిల్లా వ్యవసాయ అధికారి కోర్రా అభిమన్యుడుతో కలసి వారు మాట్లాడుతూ నేటి నుండి ఈ నెల 30వరకు ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ మేలా నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నీటి వసతి ఉన్న ప్రతి రైతు పంటమార్పిడి చేసి ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టి ఎకరానికి నికర ఆదాయాన్ని పొందాలని తెలిపారు. తొర్రూరు మండలం హరిపిరాలలో జరిగే ఈ ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్‌లో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు.

# ఏజెన్సీ అభివృద్ధికి పెద్ద పీఠ

**పోచాపురంలో తాత్కాలిక ఆస్పత్రి ప్రారంభం**
**ఇక నుండి గిరిజనులకు మెరుగైన వైద్యం**
**కలెక్టర్ దివాకర్ సమస్యలు పరిష్కరిస్తారు**
**లింగాలలో మరొక సబ్ సెంటర్ కావాలని వినతి**
**కొడిసెల ఆస్పత్రి బాగుకోసం కలెక్టర్ చర్యలు**
**తాడ్వాయిలోని కస్తూర్బా కళాశాల భవనం ప్రారంభోత్సవం**

*మేడారం, జూలై 13, ప్రభాతవార్త:*



ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఏ మాత్రం వెనుకడుగు వేయ కుండా అన్ని విధాలుగా అ భివృద్ధి బాటలు వేస్తున్నామని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండల కేంద్రానికి దూరంగా విసిరి పారేసినట్లుగా లింగాల పోచాపురం గ్రామా లున్నాయి. వైద్య సదుపాయం లేనందున పోచాపురంలో తాత్కాలిక ఆస్పత్రిని ఏర్పాటు చేయించామని సీతక్క అన్నారు. ఆ గ్రామాన్ని శనివారం సందర్శించారు. జిల్లా వైద్యాధికారి అలెం అప్పయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాలు పడితే పోచాపురం, బంధాల, అల్లిగూడెం గ్రామాలకు వైద్య సదుపాయాలు ఉండవు. వాగు పడితే అందరూ అక్కడే ఆగిపోతారు. ఈ విధంగా వర్షాకాలమంతా ఇబ్బందులు పడేవారు. వైద్యం కోసం ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు . తద్వారా ఐదు గ్రామాలకు వైద్య సదుపాయం అందుతుందని ఆమె అన్నారు. అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందిస్తారు. అలాగే లింగాల గ్రామంలో సైతం సబ్ సంటర్ కావాలని గ్రామస్తులు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో లింగాల, బోటి లింగాల, దుబ్బగూడెం, మామిడి గూడెం గ్రామాలు సైతం, లింగాల పరిధిలో ఉంటాయన్నారు. ఈ ఐదు గ్రామాలకు సబ్ సెంటర్ ఉన్నట్లయితే వైద్య సదుపాయం అందు బాటులో ఉంటాయన్నారు. ఈ విషయంపై మంత్రి సీతక్క స్పందిస్తూ తప్పకుండా మీ గ్రామాలకు కూడా సబ్ సెంటర్‌ను త్వరలోనే అందు బాటులోకి తెచ్చి లింగాల గ్రామంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని అన్నారు. అంతే కొడిసెల నుండి పోచా పురం వెళ్లేందుకు ఐదు కి. మీటర్ల దూరానికి రవాణా సౌకర్యం విష యమై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని అన్నారు. అనంతరం తాడ్వాయిలోని కస్తూర్బా కళాశాల అధనపు భవనాన్ని ప్రారంభించారు. కస్తూర్బా కళాశాల విద్యా ర్థులకు తగినట్లుగా అధనపు గదులు లేనందున అధనపు గదులను నిర్మించడం సంతోషకమని ఆమె అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ పుష్పలత కళాశాలలో ఉన్నటువంటి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసు కెళ్లగా ఆమె స్పందిస్తూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్క రిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శబరిష్, ఏఎస్పీ తోట రవీందర్, తహసీల్దార్ తోట రవీందర్, ఎంపిడివో, ప్రస సీఐ రవీందర్, తాడ్వా యి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఎంపివో శ్రీధర్‌రావు, ఆర్ఐ సాంబయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లు దేవేందర్, పాక సాంబయ్య, రాజేందర్ తదితరులు ఉన్నారు.

# వస్త్ర రంగంలో దిగ్గజం జీవీమాల్

**- ఆషాడం మేళాలో ఊహించని ఆఫర్లు...**
**- మగువల మనస్సు దోచుకుంటున్న ఆఫర్లు**

*నర్సంపేట, జూలై 14 - ప్రభాతవార్త:*




వస్త్ర వ్యాపార ప్రపంచంలో మకుటం లేని దిగ్గజంగా నిలిచింది మన నర్సంపేట జీవీమాల్... ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో ఎవరూ ఊహించలేని, కనీవినీ ఎరుగని భారీ డిస్కౌంట్లు, ఆఫర్లతో అందరి చూపును తనవైపు తిప్పుకుంటోంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటూ సందర్భాన్ని బట్టి మగువల మనస్సు దోచుకునే ఆఫర్లు ప్రకటిస్తూ తిరుగులేని దిగ్గజంగా నిలుస్తుంది మన జీవీ మాల్... ఇప్పుడు ఆషాడం మాసం ప్రారంభం కావడంతో కేజీ సేల్స్‌తో పాటు 50 శాతం డిస్కౌంట్ ప్రకటించడంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వర్క్ శారీస్ మేళా, హ్యాండ్లూమ్ ఉత్సవ్, కాటన్ స్పెషల్ వెరీ రేర్ రేంజ్ అండ్ బెస్ట్ కలెక్షన్స్, కాంబో ఆఫర్స్, పట్టు, ఫ్యాన్సీ శారీస్‌పై 50 శాతం, లేడీస్ వేర్‌పై 33 శాతం, కేటలాగ్ శారీస్‌పై 20 శాతం, కిడ్స్ వేర్‌పై వన్ ప్లస్ వన్ ఆఫర్లు ప్రకటించారు. ఇంత భారీ మొత్తంగా ధరలు




తగ్గించి డిస్కౌంట్లు ఇవ్వడం కేవలం మన జీవీ మాల్‌కే సాధ్యమని వినియోగదారులు చెప్పకనే చెప్తున్నారు. ఈ ఆఫర్లు చూసిన వారు, విన్నవారు కొనుగోలు చేసేందుకు బారులు తీరుతున్నారు.

# ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకుందాం

## వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా

*వరంగల్ క్రైమ్, జూలై 13, (ప్రభాతవార్త) :*

రాబోయే పండగలను శాంతియుత వాతావరణంలో జరుపుకుందామని వరంగల్ పోలీస్ కమీషనర్ ప్రజలకు సూచించారు. ఈ నెలలో మొహర్రం, తొలి ఏకాదశి పండగలు సమీపిస్తున్న వేళ సెంట్రల్ జోన్ పరిధిలోని శాంతి పరిరక్షణ కమిటీలతో వరంగల్ పోలీస్ కమీషనర్ ఆధ్వ ర్యంలో శనివారం పోలీస్ కమీషనరేట్ కార్యాలయములో ప్రత్యేక సమా వేశాన్ని ఏర్పాటు చేసారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలకు చెందిన వివిధ మతాలకు చెందిన మత పెద్దలతో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ శాంతి పరిరక్షణ కమిటి సమావేశంలో వరంగల్ పోలీస్ కమీషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముం దుగా పండుగల వేళ అధికారులు తీసుకోవాల్సిన చర్యలు వివిధ మత పెద్దలు అధికారులకు పలు సూచనలు చేసారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ చరిత్ర వున్న మన ఓరుగల్లు నగరంలో ప్రజలందరు పండుగలను సోదరభావంతో కల్సి జరుపుకోవడం ఇక్కడి ప్రజల ప్రత్యేకతని, ముఖ్యంగా పండగల సమయంలో ప్రతి ఒక్కరు ఇతర మతాలను గౌరవిస్తూ పండు గలను జరుపుకోవాలని పోలీస్ కమీషనర్ తెలిపారు. ఇదే సమా



వేశంలో గంజాయిపై పోలీస్ కమీషనర్ ప్రస్తావిస్తూ మతాలు ఏవైనా ముందుగా తమ పిల్లలను గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా జాగ్రత్త పడాలని, ప్రధానంగా తమ పిల్లల కార్యకలాపాలతో, వ్యవ హారశైలిపై పెద్దలు గమనించాలని, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నిర్మూలనకు అన్ని మతాల వారు తమ వంతు సహ కారాన్ని అందించాలని పోలీస్ కమీషనర్ తెలియజేసారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా, అదనపు డిసిపి రవి, ఏసిపిలు దేవేందర్ రెడ్డి, నందిరాం నాయక్, తిరుమల్‌తోపాటు ఇన్స్‌పెక్టర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.

# రైతులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

## టిజి రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్

*పోచమ్మ మైదాన్, జూలై 13, (ప్రభాతవార్త)*

గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధి లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్‌లో శనివారం తెల్లవారు జామున రైతులపై కొందరు దళారులు దాడి చేశారు. దాడికి పాల్పడిన గుమ్మస్తాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతన్న అని భావించే భారత దేశంలో ఎండనక, వాననక కష్టపడి పంటలు పండించి ప్రజలకు అన్నం పెడుతున్న రైతులపై అమానుషంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులు నిత్యం లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌కు రోజువారీగా వస్తున్నట్టుగానే కూరగాయలు అమ్ముకోడానికి శనివారం తెల్లవారు జామున 3 గంటలకు మార్కెట్‌కు కూరగాయలు తీసుకుని రాగా పాప్ నెంబర్ 98లో పనిచేస్తున్న గుమ్మస్తాలు సునీల్, రంజిత్, వినోద్ వీరితో మరికొందరు వెంకటేశ్వరరావు, అనంతరం, గీసుకొండ మండలం, సిరుల రవీందర్ వంజరపల్లి గ్రామం రైతులైన వీరిపై విచక్షణ రహితంగా దాడి చేశారు. రైతులు పండించిన పంటలను ఎక్కడైనా స్వేచ్ఛగా అమ్ముకునే విధంగా ఉండాలని ప్రభుత్వాలు చెప్తుంటే మరోపక్కన రైతులనుఅమ్ముకోకుండా భయాందోళనకు గురి చేస్తూ పంటను



తక్కువ ధరకు అమ్ముకునే విధంగా మార్కెట్‌లో కొందరు దళారులతో పాటు పెట్టుబడిదారులు మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులపై దాడి చేసిన వ్యక్తులపై పిడి యాక్టు పెట్టి ఏ రైతులపై దాడి చేయకుండా ప్రభుత్వం స్పందించాలన్నారు. రైతులు పంటను స్వేచ్ఛగా అమ్ముకునే విధంగా లక్ష్మీపురం మార్కెట్‌లో సదుపాయాలు కల్పించాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ ఘటనపై ఇంతేజర్గంజ్‌పోలీసు స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు న్యాయం చేయకపోతే పెద్దఎత్తున రైతాంగాన్ని కదిలించి రైతులకు న్యాయం జరిగే విధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య, బాధ్యులు సిరుల రవీందర్, సయింపు వెంకటేశ్వర్‌రావు, రాంబాబు, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ వార్త

## కేయూ బాలికల యూనివర్సిటీ హాస్టల్లో కుప్పకూలిన స్లాబ్

### ఎవరు లేకపోవడంతో తప్పిన ప్రమాదం

*హనుమకొండ ఎడ్యుకేషన్, జూలై 13, (ప్రభాతవార్త):*



శుక్రవారం రాత్రి హనుమకొండ లోని కాకతీయ యూనివర్సిటీ పోతన గర్ల్స్ హాస్టల్‌లో స్లాబ్ కుప్పకూలిన ఘటన చోటు చేసుకుంది. ఆసమయంలో హాస్టల్ గదిలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇటీవల ఫ్యాను ఊడి మీద పడి తల పగిలిన ఘటన మరువక ముందే మరో ఘటన చోటు చేసుకోవడం విద్యార్థుల్లో భయం చోటు చేసుకుంటుంది. గతంలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధి కారులు హడావిడి చేశారు కానీ హాస్టల్ లో ఉన్న వారిని చేంజ్ చేసే ప్రయత్నం అయితే ఎవరు చేయలేదు. తరచు ప్రమాదాలు జరుగుతున్న కాకతీయ యూనివర్సిటీలో ఎవరు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతన భవనాలలో హాస్టల్స్ నిర్వహిస్తున్న పరిస్థితి ఎప్పుడు తప్పుతుందో అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ భవనం పెచ్చులు ఊడిపడతాయా ఎవరిపై ఫ్యాన్లు ఊడి పడతాయా అన్న భయంతో బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు కాకతీయ యూనివర్సిటీ హాస్టల్లో గడుపుతున్న పరిస్థితి.ఇప్పటికైనా అధికారులు రాజకీయ నాయకులు స్పందించి కొత్త భవనాలు నిర్మించి విద్యార్థులకు అన్ని వసతులు ఉన్న భవనాలలోకి హాస్టల్స్ మార్చాలని విద్యార్థులు వేడుకుంటున్న పరిస్థితి కాకతీయ యూనివర్సిటీలో నెలకొంది. కార్పోరేషన్ అధికారులు వర్షాకాలం నేపథ్యంలో పురాతన భవనాలు కూలి ప్రాణ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో గత కొన్ని రోజుల క్రితం వాటి జాబితా సిద్ధం చేసి అన్నప్పటికే నగరంలోని కాలనీలలో ఉన్న భవనాలను చూస్తారే తప్ప ప్రభుత్వ హాస్టల్‌ల వైపు కన్నెత్తి చూడడం లేదు.

**కేయూ రిజిస్ట్రార్‌ను ఘిరావ్ చేసిన విద్యార్థులు :**

శుక్రవారం రాత్రి స్లాబ్ కూలి బాలికల హాస్టల్ గదిని పరిశీలించడానికి వచ్చిన రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కేయూ విద్యార్థులు మరియు వివిధ విద్యార్థి సంఘాలు ఘెరావ్ చేశాయి. ఎన్ని రోజులు ఇలా భయపడకుండా హాస్టల్లో ఉండాలని ఇప్పటికైనా పురాతన హాస్టల్ భవనాన్ని కూల్చివేసి నూతన భవన నిర్మించాలని డిమాండ్ చేశారు.

# గ్లోబల్ ఏఐ సమ్మిట్ లోగోను ఆవిష్కరించిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

*కాటారం, జూలై 13, (ప్రభాతవార్త)*



గ్లోబల్ ఏఐ సమ్మిట్ హైదరాబాద్-2024 లోగోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి రాష్ట్ర ఐటి,పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. సెప్టెంబర్ 5నుండి 6వరకు ప్రతిష్ఠాత్మకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గ్లోబల్ సమ్మిట్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈయొక్క సమ్మిట్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏఐ నిపుణులు, కంపెనీలు, ఐటి నిపుణుల సంఘమానికి సాక్షిగా నిలు స్తుందన్నారు. హైదరా బాద్‌ను గ్లోబల్ ఏఐ క్యాపిటల్‌గా స్థాపించాలనే లక్ష్యానికి అనుగుణంగా ఉందని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు

# కస్తూర్బా గాంధి బాలికల విద్యాలయం ప్రారంభం

## విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి,మంత్రి సీతక్క

*ప్రభాతవార్త కన్నాయిగూడెం*



శనివారం కన్నాయిగూడెం మండలంలో రాష్ట్ర పంచాయితీరాజ్,గ్రామీణ అభివృద్ధి,స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి ధనసరి సీతక్క మండలంలో పర్య టించారు.అలాగే మూడుకోట్ల రుపాయలతో ముప్పనపల్లి గ్రామంలో నిర్మిం చినా కస్తూర్బా గాంధి బాలికల విద్యాలయం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఏజెన్సి మండలల విద్యార్థులు కస్తూర్బా గాంధి బాలికల విద్యాలయం వినియోగించుకోవాలని అన్నారు.విద్యార్థులు కష్ట పడి చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర,అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థల శ్రీజ,మండల అధికారులు, ప్రజలు,కాగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# ఘనంగా చైతన్య విద్యా సంస్థల చైర్మన్ వర్ధంతి

## నివాళ్లర్పించిన చైర్మన్, ప్రిన్సిపాల్

*పోచమ్మ మైదాన్, జూలై 13, (ప్రభాతవార్త)*

వరంగల్ నగరం కాశీబుగ్గలోని శ్రీచైతన్య పాఠశాలలో శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్, ఫౌండర్ బి.ఎస్.రావు మొదటి వర్ధంతిని శనివారం నిర్వ హించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ఆధ్వర్యంలో ఫౌండర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల విద్యా ర్థులచే చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్య క్రమాలకు ముఖ్య అతిథులుగా చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీన్ యుగంధర్, ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యా సంస్థల ఆవిర్భావ లక్ష్యం, సాధించిన విజయాలను బిఎస్.రావు జీవిత విశేషాలను ఆయన స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్య క్రమంలో కోఆర్డినేటర్ తిరుమల్ రెడ్డి, ఇంఛార్జి జనార్దన్, అవినాష్, కాదిర్, సుమన్, అంజయ్య, రాజు, లక్ష్మి ప్రసన్న, శివాని, విద్యార్థులకు పాల్గొన్నారు.



# వరంగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## ఛిద్రమైన హోంగార్డు శరీరం

*వరంగల్ క్రైమ్, జూలై 13, (ప్రభాత వార్త) :*

వరంగల్ జిల్లాలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఓ హోం గార్డు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారి మామునూరు నాలుగవ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వడ్డేపల్లి సుధాకర్ విధి నిర్వహణలో భాగంగా శనివారం తన విధులకు హాజరయ్యేందుకు వెళుతున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో హోంగార్డు శరీరం గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైంది. విషయం తెలుసుకున్న మామునూరు పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# మైనార్టీల సంక్షేమమే ధ్యేయం

*జనగామ టౌన్, జూలై 13 ప్రభాతవార్త :*

ముస్లింల అభివృద్ధికి వారి సంక్షేమానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ అమీర్ ఆలీఖాన్ అన్నారు. జనగామజిల్లా మైనార్టీ కన్వెన్షన్ సమావేశం జనగామ పట్టణంలో శనివారం విజయ ఫంక్షన్‌హాల్‌లో అడ్వకేట్, ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ ప్రెసిడెంట్ జమాల్‌షరీఫ్ ఆధ్వర్యంలో ఉల్మా కౌన్సిల్‌జనగామ అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ హఫీజ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ అమీర్ ఆలీఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి, వారి సంక్షేమానికి కృషిచేస్తానని, తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల కోసం సంక్షేమ పథకాలను చేపడుతుందన్నారు. తన సియాసత్ పత్రిక ద్వారా ఎంతోమంది విద్యార్థులకు ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతు ఒదన్నారు. జనగామజిల్లాపట్ల ప్రత్యేక శ్రద్ద వహించి ముస్లిం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని, ముస్లింలు, మాల, మాదిగ, బంజారాలు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం కన్వెన్షన్ ప్రతినిధులు, ఇతర మైనార్టీ శాఖలు పాల్గొని అమీర్ అలీఖాన్‌ను ఘనంగా సన్మానించారు.

## జనగామ వార్త



జనగామ టౌన్, పాలకుర్తి, దేవరుప్పల, తరిగొప్పుల, లింగాలఘణపురం

## రేపటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

*జనగామ కలెక్టరేట్, జూలై 13 ప్రభాతవార్త :*

జనగామ జిల్లాకలెక్టరేట్‌లో ఈనెల 15న జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం హన్మకొండలో రైతుభరోసా పథకంపై జరిగే సమీక్షా సమావేశంలో హాజరుకానున్నట్లు, అదేవిధంగా సాధారణ బదిలీల నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజలు గమనించాలని తెలియచేశారు.

## పెంబర్తిలోని ఎంజేపీ హాస్టల్ విషయమై అధికారుల విచారణ

*ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :*



జనగామ మండలం పెంబర్తి గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే హాస్టల్‌లో టీచర్లు, సీనియర్ విద్యార్తులు వేధింపులు భరించలేక అర్ధరాత్రి హాస్టల్ గోడ దూకి పారిపోయి జనగామ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే హాస్టల్‌ముందు ఆందోళనకు దిగిన సంఘటనపట్ల శనివారం అధికారులు విచారణ చేపట్టారు. ఎంజెపీటీబీసీడబ్ల్యుఆర్ఎస్ జనగామ(బి) 8, 9వ తరగతుల విద్యార్థులను పెంబర్తిలో గల బచ్చన్నపేట బాలుర పాఠశాలలోకి మార్చడం జరిగిందని, కొంతమంది విద్యార్థులు పెంబర్తిలోగల ఎంజెపీ పాఠశాల వాతావరణ పరిస్థితులకు ఇమడలేక ఇక్కడ సీనియర్ విద్యార్థులు, పాఠశాల సిబ్బందిపై ఆరోపణలు చేస్తూ ధర్మకంచ జనగామలో గల పాఠశాలకు వెళ్లి వారి తల్లిదండ్రులతో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సంఘటనపట్ల జాయింట్ సెక్రటరీ డి.తిరుపతి, ప్రాంతీయ సమన్వయ అధికారి, జిల్లా సమన్వయ అధికారులు మనోహర్‌రెడ్డి, అనిత విచారణ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులను విచారించగా పాఠశాల ఊరికి దూరంగా ఉండడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారని, ఇక్కడ ఉండలేక గోడదూకి ఎంజెపీ జనగామ పాఠశాలకు వెళ్లిపోయారన్నారు. ఎంజెపీ బచ్చన్నపేట పాఠశాలలో ఎటువంటి ర్యాగింగ్ జరగలేదని, పాఠశాల సిబ్బంది మీద చేసిన ఆరోపణల దృష్ట్యా విచారణ జరిపి సంబంధిత టీచర్‌ను, పాఠశాల సిబ్బంది నుంచి తొలగించడం జరిగిందన్నారు. అలాగే విద్యార్థులకు సంబంధించిన అసౌకర్యాలను వారం రోజులలో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో సంతృప్తి చెందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాఠశాలలో కొనసాగించడానికి అంగీకరించినట్లు విచారణ అధికారులు తెలిపారు.

## సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన

*పాలకుర్తి, జూలై 13 ప్రభాతవార్త :*

పాలకుర్తిమండలం గూడూరు గ్రామంలో వరంగల్ పోలీస్ కమీషనర్ ఉత్తర్వుల మేరకు కమ్యునిటి పోలీసింగ్‌లో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల గూడూరు గ్రామ విద్యార్థులకు సైబర్‌క్రైమ్, మత్తుపదార్థాల విషయంలో సరైన అవగాహన కల్పిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాల్సిందిగా తెలియచేశారు. అదేవిధంగా వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో పండ్లు, పూలమొక్కలు నాటడం జరిగింది. పాలకుర్తి ఎస్ఐ ఎం.లింగారెడ్డి, సిబ్బంది జి.సోమిరెడ్డి, వి.రాజ్‌కుమార్, బి.భాస్కర్ పాల్గొన్నారు.



## వైభవంగా శ్రీబుగులు వేంకటేశ్వరస్వామివారి వార కళ్యాణం

*చిల్పూరు, జూలై 13 ప్రభాతవార్త :*



చిల్పూరు మండలకేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో శనివారం సందర్భంగా అర్చకుల వేదమంత్రోచ్ఛారణల మధ్య అంగరంగ వైభవంగా శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణంను నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారి కళ్యాణాన్ని కన్నులార తిలకించి దర్శనం చేసుకున్నారు. స్వామివారి కళ్యాణం అనంతరం అన్నదాతలు హన్మకొండకు చెందిన వాస్తవ్యులు కస్తూరి సంతోష్-సస్య, విద్యాసాగర్‌రావు-సహజ విజయపాల్ అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బి.లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ముఖ్య అర్చకులు బి.రవీందర్‌శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై ఆగడాలు ఆగాలి

### -సీఐ వేదింపులతోనే ఎస్ఐ ఆత్మహత్య

*నల్లబెల్లి, జులై 13, ప్రభాతవార్త*



పై అధికారుల, తోటి కానిస్టేబుల్ సిబ్బంది ఇబ్బందులు పెట్టడంతోనే ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ మృతిచెందారని ప్రభుత్వాలు స్పందించి దళితులపై ఆగడాలను ఆగేందుకు కఠిన చర్యలు చేపట్టాలని అంబేద్కర్ యూత్ కార్మిక సంఘం నాయకులు జమ్మల నాగరాజు, రాష్ట్ర ప్లంబర్ నాయకులు నాగరాజులు అన్నారు. శనివారం వారి కుటుంబ సభ్యులను నారక్కపేట గ్రామంలో పరామర్శించి నివాళ్లర్పించారు. 75 సంవత్సరాలు గత బ్రిటిష్ ప్రభుత్వం నుంచి అంబేద్కర్ నుంచి అవమానాలు భరిస్తూ అనగారిన కులవివక్షతను నిర్మూలించాలని, ఎన్నో పుస్తకాలు, గ్రంథాలు రాజ్యాంగ చట్టాలు రాసినా కూడా దళితులపై దౌర్జన్యాలు ఆగడాలు, అనిచివేతలు, ఆత్యచారాలు జరుగుతూనే ఉన్నాయి. దీనికి రాజ్యాంగ సవరణ చట్టాలు ఉన్నాకూడా వేధింపులు ఆగడం లేదు. దీన్ని నిర్మూలించడానికి కులమే కారణమన్నారు. 75 సంవత్సరాలై స్వాతంత్ర్యం వచ్చినా ఇలాంటి వివక్షత వైదొలగలేదన్నారు. ఇలాంటి ఆగడాలు పునరావృతం కాకుండా చట్టపరమైన న్యాయం చేకూరాలని ప్రభుత్వాన్ని కోరారు.

**-కమిటీ ఎన్నిక....**

అంబేద్కర్ యూత్ కమిటి అధ్యక్షులుగా మల్యాల కిరణ్, ఉపాధ్యక్షులు మల్యాల సునీల్, సభ్యులుగా ఈర్ల రంజిత్, కాదశి క్రాంతి, మంతెపూరి గణేష్, మంతెపూరి వేణు, మల్యాల సాయికుమార్, నరిగొమ్ముల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## మూడో మహాసభల కరపత్రం ఆవిష్కరణ

*పాలకుర్తి, జూలై 13 ప్రభాతవార్త :*




మండలకేంద్రంలో మూఢనమ్మకాల నిర్మూలన కోసం శాస్త్రీయ సమాజ నిర్మాణంకోసం గడిచిన ఐదు దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా శాస్త్రీయ ధృక్పథంతో పోరాడుతున్న తెలంగాణ రాష్ట్ర భారత నాస్తిక సమాజం మూడో మహాసభలను విజయవంతం చేయాలని కరపత్రాన్ని ఆవిష్కరించారు. వీరనారి చారలి ఐలమ్మ విగ్రహం వద్ద ప్రజావైద్యులు డాక్టర్ జి.వై.సోమయ్య బానస రాష్ట్రనాయకులు గుమ్మడిరాజుల సాంబయ్యతో కలిసి భానాస తెలంగాణ రాష్ట్రం మూడో మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ జీవై.సోమయ్య మాట్లాడుతూ ప్రజలందరూ మూఢనమ్మకాలను వీడాలని, మూడత్వంలో మునిగి దొంగబాబాల చేతిలో మోసపోవద్దని తెలిపారు. ఈ నాస్తిక మహాసభలు పీఆర్‌రెడ్డి భవన్ హన్మకొండ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా వడ్డేపల్లి రోడ్డులో డాక్టర్ జయగోపాల్ ప్రాంగణంలో ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నామని కుల మతాంతర మూఢనమ్మకాలను పోగొట్టుకోవాలనుకునే వారు ఈ సభకు ఎక్కువ మొత్తంలో వచ్చిన విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పసులాది ప్రశాంత్, బీరెల్లిరవి వర్మ, కాకర్ల కృష్ణకుమార్, పసులాది యాకయ్య, చిట్యాల కిండయ్య, శంకర్, ఎల్లయ్య, సోమయ్య, రాజు, సోమచందర్, బొట్టు శ్రీధర్ పాల్గొన్నారు.

## లింగాలఘణపురం మండలంలో పర్యటించిన గుడివంశీధర్‌రెడ్డి

*లింగాలఘణపురం, జూలై 13 ప్రభాతవార్త :*

లింగాలఘణపురం మండలంలో కాంగ్రెస్ నేత, మాజీ జడ్పీటీసీ గుడివంశీధర్‌రెడ్డి శనివారం పర్యటించారు. ఈసందర్భంగా విద్యుత్‌షాక్‌కు గురై మరణించిన కుక్కల మల్లేశ్ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందచేశారు. అనంతరం వడిచర్ల గ్రామంలో మరణించిన కూటిగంటి యాదగిరి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందచేశారు. లింగాలఘణపురం మండలకేంద్రంలో కారంపూడి చంద్రయ్య తల్లి ఇటీవలె మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొల్లూరి శివకుమార్, కాంగ్రెస్‌నాయకులు బొల్లంపల్లి నాగేందర్, మాజీ సర్పంచ్ ఉంగరాల శ్రీధర్, కడారి కృష్ణ, దూసరి గణపతి, గ్రామశాఖ అధ్యక్షులు వంచ ఉపేందర్‌రెడ్డి, రాజరవిందర్‌రెడ్డి, కోతిరాములు, బత్తిని అశోక్, నీలం మోహన్, కాటం కుమారస్వామి, దూసరి సోమనర్సయ్య, ఋషిగంపల ఆంజనేయులు, చిటుకుల వెంకటేశ్, నర్సింగ రమేష్, గండి దశరథ, బెల్లంకొండ ప్రణయ్, రాజ్, సుకేష్ పాల్గొన్నారు.



# ప్రతి మహిళా ఒక శక్తిగా ఎదగాలి : ఎమ్మెల్యే దొంతి

*నెక్కొండ, జులై 13, ప్రభాతవార్త*

మండలంలోని దీక్షకుంట్ల గ్రామంలో మహిళా కమ్యూనిటీహాల్ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం ప్రారంభించారు. మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రతి మహిళా సంఘానికి 20లక్షల రూపాయలు అందిస్తున్నట్లు ఆయన సమావేశంలో తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రతి మహిళా ఒక శక్తిగా ఎదగాలని మీకు కావలసిన సహాయ సహకారాలు సకాలంలో అందిస్తామని తెలిపారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్‌కి సంబంధించిన వాటర్ బోర్ ప్లానింగ్ నిర్మిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్,



నెక్కొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బక్కి అశోక్, నర్సంపేట, నెక్కొండ మార్కెట్ చైర్మన్‌లు పాలాయి శ్రీనివాస్, రావుల హరీష్‌రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, నెక్కొండ పట్టణ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, బండి శివకుమార్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, నెక్కొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సింగం ప్రశాంత్, రామాలయ కమిటీ చైర్మన్లు కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు రావుల మైపాల్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లావుడ్య తిరుమల్‌చౌహాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లి సుబ్బారెడ్డి, గరికపాటి హనుమంతరావు, ఈదునూరి సాయికృష్ణ, చల్లా పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజులను బిసి-డి నుంచి బిసి-ఏలోకి మార్చాలి

*నర్సంపేట, జులై 13, ప్రభాతవార్త*



ముదిరాజులను బిసి–డి నుంచి బిసి–ఏలోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి ముదిరాజ్, ఎన్ఆర్ఐ విభాగం రాష్ట్ర ఇంచార్జ్ శాణబోయిన రాజ్‌కుమార్, వరంగల్ జిల్లా మత్స్యశాఖ చీఫ్ ప్రమోటార్ చొప్పరి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అభహస్తంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మార్వోలకు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలో ఆవిష్కరించారు. ప్రభుత్వం ముదిరాజులకు ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేస్తే ముదిరాజులకు ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి సదానందం, జిల్లా నాయకులు గుంటుక సోమయ్య, నూనె నరసయ్య, దామ సాంబయ్య, ముదిరాజ్ మహాసభ మండలాల అధ్యక్షులు తోట సాంబయ్య, పల్లె రమేష్, కిసరి వెంకటేశ్వర్లు, నాయిని వేణు, బోల్ల స్వామి, మోటం రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి

*చెన్నారావుపేట, జులై 13, ప్రభాతవార్త*

విద్యుత్ షాక్ తగిలి పాడిగేదె మృతిచెందిన సంఘటన మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామంలో శనివారం నెలకొంది. రోజు మాదిరిగానే గ్రామానికి చెందిన మదమంచి సత్యవతి తమ పాడిగేదెలను మేత కోసం గ్రామ సమీపంలోకి తీసుకువెళ్లారన్నారు. మీద వేస్తున్న క్రమంలో సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వైరు తెగి కిందపడిందన్నారు. అది గమనించిన పశువులు ప్రమాదవశాత్తు తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెదిందన్నారు. దీని విలువ రూ.90 వేలు ఉంటుందన్నారు. విషయం తెలుసుకున్న పశువైద్యధికారి డాక్టర్ మాంజిలాల్ చనిపోయిన గేదెను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకున్నారు. వీరి వెంట సిబ్బంది రషీద్, జూనియర్ లైన్మెన్ మహేష్‌లు ఉన్నారు. కాగా గేదె మృతితో నష్టపోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.



## బాలాజీ పాఠశాలలో వనమహోత్సవం చిత్ర లేఖన పోటీలు

*నర్సంపేట, జులై 13, ప్రభాతవార్త*



తెలంగాణలో వన మహోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని స్థానిక బాలాజీ విద్యా సంస్థల్లో భాగమైన అక్షర ద స్కూల్ మరియు ద్వారకపేట్ రోడ్‌లో గల బిట్స్ స్కూల్ నర్సంపేటలో వన మహోత్సవం సంబంధించిన చిత్ర లేఖన పోటీలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని చిన్నారులు విద్యార్థిని, విద్యార్థులు చెట్లను రక్షించాలి మరియు నీటిని పొదుపుగా వాడుకోవాలి మరియు భూమి కాలుష్యం కాకూడదు అనే అంశంపైన పాఠశాల ప్రాంగణంలో చిత్ర లేఖన పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. బాలాజీ సంస్థల చైర్మన్ డా.రాజేంద్రప్రసాద్ రెడ్డి మొక్కలు నాటి విద్యార్థులను ఉద్దేశించి మానవాళికి అటవీ సంపద ఎంతో అవసరం అని వృక్షో రక్షిత రక్షిత: మొక్కలను పెట్టి మనం వాటిని సంరక్షిస్తే అవి మనల్ని సంరక్షిస్తాయి అని మన ఆరోగ్యం బాగా వుండాలో అంటే మొక్కలకు ఎంతో ప్రాధాన్యత వుంది అని, ప్రతి ఒక్కరూ కూడా తన ఇంటి వద్ద మొక్కలు నాటి సంరక్షణ చేయాలని విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.జ్యోతి మాట్లాడుతూ కాలుష్యాన్ని నిర్మూలించాలి అంటే, ప్రతి ఒక్కనూ ఒక్క మొక్క నాటి సంరక్షణ చేయాలి అని చెప్పారు. గ్రీన్ హౌస్ ఎఫెక్ట్‌ను నిర్మూలించవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డా.రాజేంద్రప్రసాద్ మరియు ట్రెజరర్ వనజ, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.జ్యోతి, సెక్రెటరీ డా.రాజేశ్వర్ రెడ్డి, సీఏఓ సురేష్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయిని బృందం మరియు విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నవోదయకు ఎంపికైన సిద్దార్థ విద్యార్థిని

*చెన్నారావుపేట, జులై 13, ప్రభాతవార్త*



మండల కేంద్రంలోని సిద్దార్థ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న ముదురుకోళ్ల శ్రీవిద్య అనే విద్యార్థిని జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కందిగోపాల్‌రెడ్డి అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్ణాకర్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో సత్తా చాటారన్నారు. విద్యార్థులు ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించి ప్రయోజనకులను చేయడమే తమ లక్ష్యమన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నర్సంపేట వార్త

**నర్సంపేట, నల్లబెల్లి, చెన్నారావుపేట,**

## హత్య ఘటనలపై పెద్ది మాట్లాడడం సరికాదు

*చెన్నారావుపేట, జులై 13, ప్రభాతవార్త*



కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు మోహన్‌నాయక్ హత్య ఘటనలపై పూర్తి సమాచారం తెలుసుకోకుండా మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి స్థాయికి తగదని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు భూక్య మోహన్‌నాయక్ అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పదహారుచింతల్‌తండా గ్రామంలో జరిగిన హత్యలు దారుణమని క్షమించరాని నేరమని నిందుతున్ని కఠినంగా శిక్షిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబాన్ని అండగా ఉంటుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హామి ఇచ్చారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది గతంలో జరిగిన సంఘటనలు గుర్తు చేసుకోవాలని అన్నారు. మీ ప్రభుత్వంలో చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాక ఇదే మండలం అమృతండాకి చెందిన గిరిజన యువ నాయకుడు ఆత్మహత్య చేసుకుంటే పరామర్శకు వచ్చిన ఆనాటి ఎమ్మెల్యే పెద్ది బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని చెప్పి హామి ఇచ్చి జాడా లేకుండా పోయిన విషయం మండల ప్రజలకు తెలుసునని అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి చనిపోతే కానీసం పరామర్శకు వెళ్ళలేదని ఆయన గుర్తు చేశారన్నారు. ఇప్పటికైనా ఇలాంటి ప్రచారం మానుకోవాలన్నారు.

## పదహారుచింతల్‌తండా గ్రామంలో కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్

*చెన్నారావుపేట, జులై 13, ప్రభాతవార్త*

మండలంలోని పదహారుచింతల్‌తండా గ్రామంలో పోలీస్‌పికెటింగ్ కొనసాగుతుంది. ప్రేమించిన యువతిని తనకు దక్కకుండా చేశారంటూ గూడూరు మండలం గుండెంగ గ్రామంలో అమ్మమ్మ ఇంటివద్ద ఉండే మేకల నాగరాజు అలియాస్ బన్ని అనే ఆటో డ్రైవర్ బుదవారం అర్ధరాత్రి పదహారుచింతల్‌తండాలో వేటకత్తితో విచక్షణ రహితంగా దాడిచేయగా బానోతు సుగుణ, బానోతు శ్రీనివాస్ దంపతులు ప్రాణాలు వదిలిన విషయం తెలిసిందే. ఈ దాడి రాష్ట్ర వ్యాప్తంగా పెను సంచలనాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమీషనర్, డీసీపీ ఆదేశాల మేరకు తండాలో పోలీస్ బందోబస్తు చేపట్టారు. స్థానిక ఎస్ఐ గూడ అరుణ్ ఆధ్వర్యంలో పదహారుచింతల్‌తో పాటు సమీపంలోని గుండెంగలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పగలు రాత్రి అనేది లేకుండా పోలీసులు ఆ ప్రాంతంలో ప్రహారా కాస్తున్నారు. ఈ దాడి అనంతరం ఎలాంటి అవాంచనీయ ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఉందేందుకు గాను పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రధాన రహదారి వద్ద భారీకేట్లు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు.

**–అనుమానితుల పట్ల కొనసాగుతున్న విచారణ....**

కాగా ఈ దాడికి ప్రధాన కారకుడైన నాగరాజు అలియాస్ బన్నిని ఇప్పటికే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఈ ఘటనకు పరోక్షంగా ఎవరైనా సహకరించి ఉంటారనే కోనంలో పోలీసుల విచారణ సాగుతుంది. నింధితుడు నిత్యం తిరిగే గుండెంగ, నెక్కొండ గూడూరు మార్గంలో సైతం పోలీసులు నిఘా కొనసాగిస్తున్నారు. అతని మిత్రులు కాని అతనితో ఉన్న పరిచయస్తులను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ హత్యకు ఒకడే పాల్పడ్డాడా...? ఇంకా ఎవరైనా సహకరించారా అనే కోనంలో పోలీసులు పలువురి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగుతుంది. ఘటన స్థలానికి అతను వచ్చిన వాహనం, వాడిన ఇతర వస్తువులను ఇచ్చిన వ్యక్తులను సైతం విచారిస్తున్నట్లు తెలుస్తోంది. రెండ్రోజులుగా పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రాత్రిపూట విచారణ అనంతరం వదిలేస్తున్నారంటున్నారు. అంతేగాక నింధితుడు తిరిగిన ప్రాంతాన్ని మొత్తం టాస్క్‌ఫోర్సు పోలీసులు పరిశీలించి తగిన సమాచారాన్ని సేకరిస్తున్నారన్నారు. ఏదేమైనా ఈ ఘటనలకు పాల్పడిన నింధితుడు నాగరాజును ఉరితీయాలని లేదంటే శాశ్వతంగా జైలులోనే ఉంచాలని అలాగే అతనికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన వ్యక్తులను సైతం కఠినంగా శిక్షించి మరోసారి ఇలాంటి ఘటనలు జరుగకుండా పోలీసులు హెచ్చరికలు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు.

# గంజాయి రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్

**-ఆరు కేజీల గంజాయి స్వాధీనం**

**-బీహార్‌కు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్**

**-పరారీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రదీప్ అనే నిందితుడు**

**-వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**

**-పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించిన ఎస్పీ కిరణ్ ఖరే**

ప్రభాతవార్త ప్రతినిధి - జయశంకర్ భూపాలపల్లి



గంజాయి నియంత్రణకు ప్రజలు సహకరించాలని, పూర్తిస్థాయిలో నియంత్రించుటకు జిల్లా పోలీసు యంత్రాంగం కష్టపడుతుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడారు. శనివారం ఉదయం 7గంటలకు గంజాయి రవాణా గురించి నమ్మదగిన సమాచారం మేరకు ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో గణపురం ఎస్ఐ మచ్చ సాంభమూర్తి తన సిబ్బందితో కలిసి గాంధీనగర్ క్రాస్ రోడ్ వద్దకు వెళ్లి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానస్పద స్థితిలో కనబడగా, వారిని కస్టడీలోకి తీసుకొని విచారించగా వారి వద్ద ఒక బ్యాగు ఉండగా అందులో దాదాపు 1/2కేజీ గంజాయి కనిపించగా వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా తదుపరి వారు నివాసముంటున్న అద్దెగది గాంధీనగర్ క్రాస్‌కి వెళ్లి దాచిపెట్టిన మరో ఐదున్నర కేజీల గంజాయి మరియు మరో నిందితుడిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. వీరు బీహార్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు. దాదాపుగా ఆరె నెలల ప్రాంతం నుండి చెల్పూర్‌లోని రైస్‌మిల్లులో పనికోసం వచ్చి జల్సాలకు అలవాటు పడి అట్టి పనిచేస్తున్న డబ్బులు సరిపోకపోవడంతో వీరు గతంలో పరిచయం ఉన్న ప్రదీప్ అనే వ్యక్తికి కాంటాక్ట్ అయ్యి అతని వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ ఇక్కడకు తీసుకువచ్చి ఎక్కువ రేట్లకు అమ్ముతూ అలా వచ్చిన డబ్బులతో జల్సాలకు అలవాటుపడ్డారని విచారణలొ ఒప్పుకున్నట్లు తెలిపారు. తదుపరి పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి సీజ్ చేసిన 6కేజీల గంజాయిని మరియు ముగ్గురు వ్యక్తుల్ని పోలీస్‌స్టేషన్‌కి తీసుకొచ్చి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇట్టి కేసుకు సంబంధించిన నిందితుల వివరాలు బీహార్‌కు చెందిన గణేష్ ఠాకూర్, మింటూ కుమార్, చందన్ పాశ్వాన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రదీప్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ..గంజాయి నియంత్రణకు ప్రజలకు సహకరించాలని, పూర్తి స్థాయిలో నియంత్రించుటకు జిల్లా పోలీసు యంత్రాంగం కష్టపడుతుందని, గంజాయిపై ప్రత్యేక నిఘా పెట్టి గంజాయి నిర్మూలనకు కృషి చేస్తుందని, గంజాయికి సంబంధించిన ఏసమాచారం ఉన్నా డయల్ 100ద్వారా గాని స్థానిక పోలీసు అధికారికి చేరవేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇట్టి ఆరు కేజీల గంజాయిని పట్టుకోవడంలో ఉత్తమ విధులు నిర్వర్తించిన భూపాలపల్లి డిఎస్పీ ఏ.సంపత్ రావు, చిట్యాల సిఐ దగ్గు మల్లేష్, గణపురం ఎస్ఐ మచ్చ సాంభమూర్తి, సిబ్బంది నేతాజీ, శ్రీనివాసులును ఎస్పీ కిరణ్ ఖరే ప్రత్యేకంగా అభినందించి రివార్డు ప్రకటించారు.

# అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో శ్రీపూరిజగన్నాధస్వామి రథ శోభయాత్ర

**-హారేరామ హరేకృష్ణ నామస్మరణంతో మారుమ్రోగిన పురవీధులు**

**-తెలుపు పసుపు,గంధం రంగుమయమైన పురవీధులు**

**-ఇంటింటి నుండి మంగళహారతులు అందుకున్న జగన్నాధస్వామి**

గార్ల, జులై13 ప్రభాతవార్త:





శ్రీపూరి జగన్నాధ స్వామి రథయాత్రను పురస్కరించుకొని మండల కేంద్రంలో శ్రీరామదండు108కమిటి, గణేష్‌యువజన కమిటి, వర్తకసంఘం కమిటి, ఆద్వర్యంలో గార్లఇస్కాన్ కమిటి మహబూబాబాద్ జిల్లాలోనే మొట్టమొదటి సారిగా గార్లలో శనివారం హిందూభక్తులతో కలిసి శ్రీపూరిజగన్నాధస్వామి రథశోభయాత్ర అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుట్టకోట శ్రీకోదండరామస్వామి ఆలయంలోని అన్ని వీధులలో మహిళలు రంగురంగుల రంగవల్లి ముగ్గులు వేసి వీధులలో మామిడితోరణాలు, పూలమాలలతో శ్రీకోదండరామాలయంతో పాటు వీధులను అలంకరించగా పండుగ వాతావరణంను



సంతరించుకుంది. ఆలయంలో కమిటిలు, భక్తులు పూలమాలలు, తులసిమాలలతో అందంగా అలంకరించిన జగన్నాధ స్వామివారికి వేదపండితులు, అర్చకులు హరేరామ,హరేకృష్ణ పండితులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలు, తోరణాలతో వైభవంగా అలంకరించిన ప్రత్యేకరథంపై వేంచేపుచేసినారు. కమిటిల సభ్యులు, భక్తులు మహిళలు, యువత ప్రత్యేక సాంప్రదాయ దుస్తులు ధరించిగా జడ్పిటిసి జాటోత్ ఝాన్సి లక్ష్మీ, మాజీసర్పంచులు, మాజీఎంపిటీసీలు, పురప్రముఖులు పాల్గొని కమిటిసభ్యులు, హరేరా, హరేకృష్ణ భక్తులతో కలిసి హరేరామ, హరేకృష్ణ నామస్మరణలు చేస్తు రథయాత్రను ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాలను పుట్టకోట శ్రీకోదండరామ చంద్రస్వామి ఆలయం నుండి ప్రారంభమైన రథయాత్ర ప్రధాన పురవీధుల గుండా డీజెపాటలు, సన్నాయి మేళతాళాలు మ్రోగించగా హరేరామ, హరేకృష్ణ నామస్మరణాలతో పురవీధులు మారుమ్రోగాయి. తెలుపు, పసుపు, గంధం రంగుల దుస్తులతో వీధులన్ని అలంకరణగా మారాయి. ఈశోభయాత్రలో ఇంటింటి నుండి భక్తులు మంగళహారతులు సమర్పించి దర్శించుకున్నారు. వర్తకసంఘ భవనంకు చేరుకొని భక్తులు జగన్నాధస్వామి వారలను కనులారా దర్శించుకొని అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి పునీతులైనారు. ఈకార్యక్రమంలో ఆయాకమిటిలసభ్యులు, హరేరామ, హరేకృష్ణ భక్తబృందం, మహిళలు, యువత, భక్తులు, ప్రజలు, తదితరులు



## జయశంకర్ వార్త

జయశంకర్ భూపాలపల్లి, భూపాలపల్లి రూరల్, మల్హర్‌రావు, రేగొండ

### లారీ డ్రైవర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

భూపాలపల్లి, జులై13, ప్రభాతవార్త



భూపాలపల్లి ఏరియా లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా చిత్తారి వీరయ్య, ఉపాధ్యక్షులుగా బొజ్జపల్లి సమ్మయ్య, ఎనగంటి రమేష్, ప్రధాన కార్యదర్శిగా కోల సంపత్, కోశాధికారిగా కొర్ర పూర్ణచందర్, కార్యవర్గ సభ్యులుగా తాళ్లపల్లి రాజు, చంటి అరవింద్, అంతడుపుల మహేష్, గుండు రిత్విక్, పాలకుర్తి నరేష్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### కాంగ్రెస్ పార్టీలో మాజీ డైరెక్టర్ చేరిక

భూపాలపల్లి, జులై13, ప్రభాతవార్త



కాళేశ్వరం దేవస్థానం మాజీ డైరెక్టర్ దండ ప్రశాంత్‌రెడ్డి భూపాలపల్లి ఎంఎల్ఎ గండ్ర సత్యనారా యణరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిప్పాల రాజేందర్, శిరుప అనిల్‌కుమార్, ఇస్లావత్ దేవన్, క్యాతరాజు సాంబమూర్తి, నాగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బిట్స్ స్కూల్‌లో ఘనంగా వనమహోత్సవం

భూపాలపల్లి, జులై13, ప్రభాతవార్త



భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో శనివారం వన మహో త్సవం కార్యక్ర మంను స్వచ్ఛందంగా జరుపుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ రాజేష్‌కుమార్ చౌదరి ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని, భవిష్యత్ తరాల కోసం ఎన్నో ప్రయోజనాలు చేకూర్చేందుకు స్వచందంగా మొక్కలను నాటాలని సూచించారు. స్కూల్ టీచర్లు కే నదీముద్దీన్, అనిత, మమత, రాజేందర్, తడుక నిఖిల్, బుర్ర కిరణ్‌కుమార్, చాంద్ పాష పాల్గొన్నారు.

### ఖాళీ బిందెలతో డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద మహిళల ఆందోళన

**-త్రాగునీటితో పాటు కాలనీ సమస్యలు తీర్చాలని డిమాండ్**

భూపాలపల్లి రూరల్, జులై 13, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు పెద్దకుంటపల్లిలో గల డబుల్ బెడ్‌రూం కాలనీలో మంచినీటి సమస్యతో పాటు, కాలనీలో సమస్యలను తీర్చాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో డబుల్ బెడ్‌రూం కాలనీవా సులు శనివారం ధర్నా నిర్వహించారు. తాము ఇండ్లలోకి వచ్చి ఏడాది కావస్తున్న కనీస మౌళిక వసతుల సౌకర్యాలు ఏవి కల్పించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరూ పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు.



# సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బయ్యారం,జూలై13,ప్రభాతవార్త

వర్షాకాలం రానే వచ్చింది. వర్షాకాలంలో వర్షాలు పడితే అందరికి ఆనందం కలుగుతుంది. వేసవి తాపం నుండి ఉపశమనం కలుగుతుంది. అయితే వర్షాలతో పాటు సీజనల్ వ్యాదులు కూడా వచ్చే ప్రమాదం ఉంది. అందుకే వర్షాకాలంలో కచ్చితంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.తొలకరి మొదలైంది.. రోజు వర్షాలు కురుస్తుండడంతో వీదుల్లో నీరు నిల్వ చేరుతుంది. దోమలు వ్యాప్తి చెందుతుండడంతో సీజనల్ వ్యాదుల విజృంభన ప్రారంభమైంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోగాలకు ప్రధాన కారణం దోమలే కారణమని వైద్యులు చెబుతున్నారు. ఇళ్లవద్ద, వీదుల్లో నీరు నిల్వ చేరడంతో దోమలు విపరీతంగా పెరిగి




వ్యాదుల వ్యాప్తికి కారణమవుతున్నాయని వివరిస్తున్నారు. వైరల్ జ్వరాలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచిస్తున్నారు. సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మజీవుల వలన వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. ఇవి గాలి, నీటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి వైరల్ జ్వరాలకు కారణమవుతాయి. సీజనల్ వ్యాదులైన చికెన్‌గునియా, మలేరియా, కలరా,డెంగ్యూ తదితర వ్యాదులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, చెత్తచెదారం సమీపంలో ఉండకుండా చూడాలని, దోమ తెరలు లాంటివి వాడడం శ్రేయస్కరం అంటున్నారు. అదేవిధంగా ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండీషనర్లు, పూలకుండిల్లో ఉన్న నీటిని తరుచూ మార్చుతూ ఉండాలని సూచిస్తున్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, బయట ఆహారం తినకూడదని, వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకోవాలంటున్నారు. ప్రజలు అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే తప్పనిసరిగా ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## దుగ్గొండి ఎస్ఐకి సన్మానం

దుగ్గొండి, జులై 13, ప్రభాతవార్త



నూతనంగా విధుల్లోకి చేరిన దుగ్గొండి ఎస్ఐ వెంకటేశ్వర్లును శనివారం బిఆర్ఎస్ మండల పార్టీ అద్యక్షులు సుకినె రాజేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి బొకే శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి అనునిత్యం సేవలందిస్తామన్నారు. శాంతి భద్రతలకు అఘాతం కలుగకుండా పాటుపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మోర్తాల రాజు, నాయకులు లాండె రమేష్, గుండెకారి రవికుమార్, పురుషోత్తం, వడ్డెపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానించిన నాయకులు

నర్సంపేట, జులై 13, ప్రభాతవార్త



నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పాలాయి శ్రీనివాస్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు బీరం భరత్‌రెడ్డి, వల్లబ్‌నగర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, జులై 13, ప్రభాతవార్త



ఫ్యామిలీ రెస్టారెంట్‌ను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం ప్రారంభించారు. పట్టణంలోని వరంగల్ రోడ్డు నందు భద్రకాళి భలే భలే ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయక నిధి చెక్కు అందజేత

నల్లబెల్లి, జులై 13, ప్రభాతవార్త



నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని మేడపల్లి గ్రామానికి చెందిన అవునూరి మహేందర్‌కి సీఎంఆర్‌ఎఫ్ 60వేల రూపాయల చెక్కును గ్రామ పార్టీ అధ్యక్షులు వంగర వెంకన్న అందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి నల్లబెల్లి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాలోతు మోహన్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు మంద చింటూ, ఆసరవెల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు జలగం రాజు, కాడబోయిన సదానందం, నడిగొట్టు సారయ్య, సట్ల ఎల్లగౌడ్, వజ్జ కొమురయ్య, అబ్దుల్, నాగరాజు,రమేష్, సుధాకర్ శ్రీకాంత్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో కొండచిలువ కలకలం

### భయాందోళనలో విద్యార్థినీలు

పరకాల, జులై 13, ప్రభాతవార్త

పరకాల మండలం మల్లక్కపేట గ్రామ శివారులోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కొండ చిలువలు సాక్షత్కరించాయి. శుక్రవారం అర్ధరాత్రి గురుకులంలో సుమారు 12 కొండ చిలువలు కలకలం సృష్టించాయి. వాటిని చూసిన విద్యార్థినీలు పోలీస్, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న వారు ఆ పాములను పట్టుకున్నారు.అప్పటికే అక్కడ ఉన్న సిబ్బంది కొందరు ఆరు పాములను చంపేశారు. గ్రామ శివారులో ఉన్న గురుకుల పాఠశాల ప్రాంతంలో పాములు స్వైర విహారం చేయడం సర్వసాదారణంగా మారిందని విద్యార్థినీల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆ బాలికల గురుకులంలో రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. చుట్టూ ప్రహారి గోడ ఉన్నప్పటికి పరిసరాలు చెట్లు, పొదలు పక్కనే పొలాలు ఉండడంతో పాములు గురుకులం భవనంలోకి చేరినట్లుగా అనుమానిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించే పాములు తేళ్ళు, వంటి విశ పురుగులు బెడద నుంచి రక్షించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



మహబూబాబాద్ వార్త

మహబూబాబాద్, మరిపెడ, కురవి, గార్ల

## ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

### -మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి

మరిపెడ,జూలై13,ప్రభాతవార్త



ప్రజల సహకారంతోనే మున్సిపాలిటి అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. శనివారం మున్సిపాలిటి పరిధిలోని పూలబజార్ బురదమయంగా ఉండడంతో కంకర, మొరాన్ని పోసి చదును చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించినప్పుడు మాత్రమే మున్సిపాలిటి అభివృద్ధి పథంలో కొనసాగుతుందన్నారు. మున్సిపాలిటి పరిధిలోని ప్రజలు సకాలంలో ఇంటి, నల్ల, వృత్తి వ్యాపార లైసెన్స్‌ల పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలన్నారు. మున్సిపల్ అనుమతి లేకుండా నూతన గృహాలు నిర్మించొద్దన్నారు. అక్రమంగా నల్లాలు, నూతన గృహాలు నిర్మించినట్లైతే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియమ నిబందనల ప్రకారమే నూతన గృహ పన్నులు చెల్లించాలన్నారు. వారి వెంట హెల్త్ ఇన్‌స్పెక్టర్ వీరన్న, మున్సిపాలిటి సిబ్బంది ఉన్నారు.

## గిరిజన కుటుంబాన్ని హత్యచేసిన నిందితున్ని శిక్షించాలి

కురవి,జూలై13,ప్రభాతవార్త



గత రెండు రోజుల క్రితం నర్సంపేట డివిజన్‌లోని చిన్నరావుపేట మండలం 16చింతల తండాలో గిరిజన దంపతులను హత్యచేసిన నిందితున్ని వెంటనే కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం.కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ నెలరోజుల పాటు ప్లాన్‌చేసి కత్తిని తయారు చేయించుకొని రెక్కి నిర్వహించి రాత్రి 2గంటల ప్రాంతంలో హత్యచేయడాన్ని చూస్తే అతడు కరుడుగట్టిన నేరస్థుడిలా ఉన్నాడని వెంటనే నిందితున్ని శిక్షించాలన్నారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామన్నారు. ఆయన వెంట సంఘం నాయకులు ఉన్నారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కుఅందజేత

మహబూబాబాద్,జూలై13,ప్రభాతవార్త

జిల్లాలోని గూడూరు సిఐ గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల గూడూరు మండలకేంద్రంలోని లారీ ప్రమాదంలో మరణించిన ధనసరి పాపారావుకు పోలీస్ ఉన్నతాధికారులు, తోటి సహోద్యోగులు పాపారావు కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో గూడూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబురావు, ఎస్సై నగేష్, కొత్తగూడ ఎస్సై దిలీప్, గంగారం ఎస్సై రవిలతో పాటు ఆయా స్టేషన్‌ల సిబ్బంది అంతా కలసి రూ.2.10లక్షలు విరాళాలు సేకరించి కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ మేరకు శనివారం జిల్లా ఎస్పి సుధీర్‌రాంనాథ్‌కేకన్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి తిరుపతిరావు, రూరల్ సిఐ శరవయ్య, సిఐ ఉపేందర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# దయనీయంగా విశ్వబ్రాహ్మణుల జీవనం

## ప్రభుత్వ అపన్నహస్తం కోసం ఎదురుచూపులు

నెల్లికుదురు,జూలై 13,ప్రభాతవార్త

రైతులు దేశానికి వెన్నెముక అంటారు. రైతులు నివసించేది పల్లెల్లో ఎక్కువశాతం. పట్టణాల్లో తక్కువశాతం నివసిస్తారు. 'రైతు' అంటే వ్యవసాయ దారుడు, దేశానికి ఆహారం పెట్టగలిగిన వాడు రైతు. దేశ జనాభలో అధికశాతం వ్యవసాయదారులే. వీరు ప్రకృతి కరుణాకటాక్షం మీద ఆదారపడి జీవిస్తునా న్నరు. ఇలా రైతుల మీద ఆదారపడి అనేక కులవృత్తి ఉన్నారు. నిజానికి రైతులు మరియు కులవృత్తి పనివారు ఒకరిమీద, ఒకరు ఆదారపడి ఉన్నారు. ఆఇద్దరి బాందవ్యం ఎంతగా పెనవేసుకుని పోయిందంటే ఒకరు లేనిదే మరొకరు లేరనే విధంగా ఉండేది. ఇదంతా గతం...



భూమినినమ్ముకుని ప్రకృతిమీద ఆధారపడి వర్షాలు లేక వారి జీవన విధానం విచ్చిన్నమైనది. రైతులను అంటిపెట్టుకుని ఉన్న కుల వృత్తి పనివారి జీవిన విధానం కూడ విచ్చిన్నమైనది. వండ్రంగులు(విశ్వబ్రాహ్మణులు)కే వలం రైతులకు కావల్సిన పరికరాలను, పనిముట్లను తయారుచేసి ఇవ్వడమే కాకు ండా వివిద రకాల నూతన పరికరాలతో రైతులకు సౌలబ్యవంతమైన పనులకు సహకరించేవారు. ఇదంతా ఒకప్పటి సంగతి, కానీ రానురాను ఆదునిక ప్రపంచంలో ఇనుముతో కూడిన అనేక అత్యాధునిక పరికరాలు రావడంతో కర్రపని ప్రాముఖ్య ం క్రమేనా తగ్గిపోవడంతో పల్లెల్లో విశ్వబ్రాహ్మణుల జీవనం కడు దయనీయంగా తయాదరైంది ఇదంతా ఇప్పుడు జరుగుతున్న విధానం.

పూర్వకాలం నుండి ఇప్పటి వరకు కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారిలో విశ్వబ్రాహ్మణులు ఒక్కరు. వీరు పూర్వం సమాజంలో ప్రత్యేకమైన గౌరవ మర్యాధలు పొందేవారు. వీరు తమ కులవృత్తులతో ఇండ్లకు సంబందించిన వస్తువులతోపాటు రైతులకు కావల్సిన వ్యవసాయ పనిముట్లను తయారుచేసి అందిస్తు ఉండేవారు. ఈ క్రమంలో అప్పటి పరిస్థితుల్లో ప్రతిరోజు పనులు దొరకడం మూలంగా దరా జ్జగా బతుకుదెరువు సాగిస్తుండేవారు. కానీ నేడు రెడిమెడ్ వస్తువులు మార్కేట్‌లోకి రావడంతోపాటు, రోజురోజుకు పెరుగుతున్న యాంత్రీకరణతో వండ్రంగులకు ఉపాధి కరువైంది. ఇది ఇలా ఉంటే మరొపక్క గ్రామాల్లో కొద్దోగొప్పో ఉపాధిపొందుతున్నా నూతన ఆటవిశాఖ చట్టలతో ఇబ్బందులకు గురౌతున్నట్లు విశ్వబ్రహ్మణులు వాపోతున్నారు. వండ్రంగులు వివిద రకాల కలుపతో కూడిన వివిద రకాలుగా తమతమ నైపుణ్యాలను రంగరిచ్చి వివిద వస్తువులను తయారుచేస్తారు. వీటిల్లో ముఖ్యంగా గృహాలకు సంబందించిన తలుపులు కిటికీలు, వీది గుమ్మాలు, ఇండ్ల పైకప్పులు, డైనింగ్ టెబుల్లు, హాయిగా కూర్చోడానికి సోఫాసెట్లు, మంచాలలతోపాటు రైతులకు సంబందించి నాగళ్ళు, ఎడ్డబండ్లు వంటివి తయారుచేసి తద్వార ఉపాధిపొందటం వీరి ప్రత్యేకత.

**మారిన నాగరికతతో విశ్వబ్రాహ్మణుల మనుగడకు ముప్పు** : నేడు ఉరుకలు వేస్తున్న హైటెక్ నాగరితతో కర్రకు బదులుగా ఫైబర్, ఇనుమును వాడుతూ విప్లవాత్మకమైన నాగరికతతో వివిద రకాల యంత్రాలు అందుబాటు లోకి రావడంతో నేడు మార్కట్‌లోకి అప్పడికప్పుడే కొనుగోలు చేసుకునే విధంగా ఫైబర్‌తో వివిద డిజైన్లతో కూడిన తలుపులు, కిటికీలు, డైనింగ్‌టెబుల్, కుర్చీలు అందుబాటులోకి రావడంతో ప్రజలు వాటివైపే మొగ్గుచూపుతున్నారు. దీనితో కులవృత్తులను నమ్ముకున్న వండ్రంగులకు ఉపాధి కరువైంది. మండలంలో వెల్లమీద లెక్కింపు చేయగలిగిన కొద్దిపాటి కుటుంబాలే ఉన్నప్పటికి అందరి పరిస్థితి ఇదే విదంగా ఉండటం గమనార్హం.

**నూతన చట్టాలతో ఇబ్బందులు** : మండలంలో ఉన్న వండ్రంగులు కుటుంబ పోషణ కోసం అడపాదడపా కొద్దిగొప్ప పనులు చేసుకుంటున్నప్పటికి, ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఆటవిచట్టాలతో ఇబ్బందులకు పద్తున్నారనేది సత్యం. మరోపక్క ఆటవీశాఖ అధికారుల వేధింపులు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కఠినచట్టాలను అమలు పరుస్తూ తమపొట్టలను కొట్టొందని కోరుకుంటున్నారు.

**పల్లెల నుండి పట్టణాల వైపు వండ్రంగుల వలసలు** : గ్రామాల్లో తమతమ కుటుంబాలను పోషించుకోవడానికి సరైన ఉపాధి లేకపోవగడంతో పట్టణాలకు వలసలు పోతున్నట్లు విశ్వబ్రాహ్మణులు తెలుపుతన్నారు. గతంలో వండ్రంగులు లేనిది రైతులు వ్యవసాయ పనులు మొదలుపెట్టెవారు కాదు, నాడు రైతులు తమతమ వ్యవసాయ పరికరాలను వండ్రంగుల వద్ద తయారుచేయించు కోవడం కోస ం రైతులు వండ్రంగుల ఇంటివద్ద బిజిబిజిగా ఉండేవారు. నేడు రెడిమెడ్‌గా ఇనుముతో తయారైన ఇనుపగొర్రు, నాగలి, ఎడ్లబండి ఇలా అన్ని రకాల పరికరాలు వండ్రంగుల అవసరం లేకుండానే రైతులకు అందుతున్నాయి. నాటి వండ్రంగుల వద్ద ఉన్న రైతుల సందడి నేడు కన్పించడం లేదు. ఈ క్రమంలో కుటుంబాలను సాదుకోలేక దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మొదటి నుండి కలవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని, చేపల పంపిణీ, గొర్రెల పంపిణీ, బర్రెల పంపిణీ మాదిరిగాను విశ్వబ్రాహ్మణుల వృత్తివారికి ఆదునిక పనిముట్లు, ఆదునిక యంత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందించి విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## -మార్కెట్ మాజీ చైర్మన్ బండి సారంగపాణి

పరకాల, జులై 13, ప్రభాతవార్త

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నప్పటికి ఇచ్చిన ఒక్క మాట కూడా నెరవేర్చలేదని పరకాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బండి సారంగపాణి ఒక ప్రకటనలో విమర్శించారు. అమలు కానీ హామీలిచ్చి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రజలను మోసం చేశారని, ప్రజల వద్దకు పాలన పేరుతో ప్రతి నెల సమావేశాలు నిర్వహిస్తామని చెప్పి మాట తప్పారని అన్నారు. కొత్త రేషన్ కార్డులు 5 వందలకు సిలిండర్, జీరో కరెంట్ బిల్, ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని పెద్ద ఎత్తున నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నా ఎలాంటి ఫలితం లేదన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, వృద్దులు, దివ్యాంగులు ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ ఫౌడర్ అందించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, వర్షాకాలంలో పారిశుద్య నిర్వాహణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను గోసకు గురి చేస్తుందని ఆయన దుయ్యపట్టారు. మేనిఫెస్టో ప్రకటించినట్లు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికి రుణమాఫీని వెంటనే అమలు చేయాలని అన్నారు. రైతులకు రైతు భరోసా పథకానికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌కు అందించాల్సిన రైతు భరోసాను వెంటనే అందించాలని అన్నారు. రైతులకు ఇస్తానన్న ఎకరాకు 15వేల హామీలను కూడా వెంటనే అమలు చేసే దిశగా పనిచేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాన్ని బదనాం చేస్తూ దరాఖాస్తులు తీసుకున్నారనే తప్ప అమలు చేసిన పాపాన పోలేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకం అబాసు పాలవుతుందని, గ్యాస్, జీరో కరెంట్ పథకాలు అమలు కాలేదని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలు తిరగబడటమే కాకుండా గ్రామాల్లో తిరగనివ్వరని స్పష్టం చేశారు.



# నివాళ్లర్పించిన చైర్మన్

పరకాల, జులై 13, ప్రభాతవార్త

పరకాల మున్సిపల్ 22వ వార్డు కౌన్సిలర్ కొలనుపాక తండ్రి కొలనుపాక రాజ వీరయ్య మృతిచెందగా శనివారం పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ ఆయన ప్రార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అన్న విధాల అండగా ఉంటామని హామి ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. వరంగల్ కార్పొరేటర్లు రావుల కిషన్, బైరి శ్రావణ్, కౌన్సిలర్ బండి రాణి, సదానందంగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి శ్రీధర్, పరకాల మాజీ సర్పంచ్ సిరంగి సతీష్‌కుమార్, పంచగిరి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



# తొర్రూరు వార్త

## బ్లూటంగ్ వ్యాదికి టీకాలు

ఇనుగుర్తి, జూలై 13, ప్రభాతవార్త



వర్షాకాలంలో గోర్లకు, మేఖలకు వచ్చే బ్లూటంగ్ వ్యాది రాకుండా ముందస్తుగా మూడు నెలలు పైబడిన గోర్లకు, మేఖలకు జిల్లా పశువైద్యాధికారి రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మౌనిక, గొర్రెల, మేఖల పెంపకం దారులు నాయిని మల్లయ్య, పత్తిపట్ల యాకన్న, కుంభ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### -కౌన్సిలర్ మడికొండ సంతప్‌కుమార్

పరకాల, జులై 13, ప్రభాతవార్త

వర్షాకాలంలో సీజనల్ వ్యాదులు ప్రభలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ ఒకటవ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ అన్నారు. శనివారం వార్డు పరిధిలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించారు. కాలనీ అంతటా కాలినడకన తిరుగుతూ మురుగునీటి కుంటలను(కాలువలను) పరిశీలించారు. కాలువల నుండి గుబురుగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగింప చేశారు. సీజనల్ వ్యాదులు ప్రభలకుండా ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలలో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ కవర్లు, వాడిన టికప్పులు, ఇతర నీటి నిలువలు గల ప్రతులను ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. ఇండ్లలో వాడే కూలర్స్ ప్రిజ్, ఏసీలతో నీరు నిల్వ లేకుండా శుభ్రపరుచుకోవాలని అన్నారు. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రిలో వైద్య చికిత్స తీసుకోవాలని కోరారు. ప్రజలందరు ఇంటి వద్దనే తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని రోడ్లపై కానీ, ఖాళీ ప్రదేశాలలో గాని, మురికి కాలువలో గాని చెత్త వేయరాదని తెలిపారు. ప్రజలు పక్కింటి ఖాళీ స్థలం ఉన్నచో అందులో చెత్త వేసి దుర్గంధం చేసి ఆ చెత్త వలన దోమలు తయారై ప్రజలకు కుట్టి అనారోగ్య పాలవుతారన్నారు. ప్రజలు చెత్తను వేరు చేసి మున్సిపల్ ఆటోలకి అందివ్వాలని కోరారు. ప్రజలందరు సహకరిస్తే పరకాల స్వచ్ఛ పట్టణంగా తయారవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జవాన్, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న శ్రీనివాస్

పరకాల, జులై 13, ప్రభాతవార్త



పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తనకు ఇవ్వాలని పరకాల మండలంలోని విలీన గ్రామం రాజుపేటకు చెందిన పబ్బ శ్రీనివాస్‌గౌడ్ కోరుతున్నారు. ఈ మేరకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. తాను 1999 నుంచి అప్పటి శ్యాంపేట నియోజకవర్గంలో సామాన్య కార్యకర్తగా ఎదిగి 2009లో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వరుసగా రెండు పర్యాయాలు పనిచేశాడన్నారు. 2009లో ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమంలో ఐకాసా విద్యార్థి గ్రామ కమిటీలో కన్వీనర్‌గా 2016లో ఉమ్మడి పరకాల మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రస్తుతం పట్టణ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. పార్టీలో ఇంతకాలంగా కొనసాగుతూ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తే సేవలు అందించిన తనను గుర్తించి పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని ఇప్పించాలని ఎమ్మెల్యేను ఆయన కోరారు.

## కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

గూడూరు, జూలై 13, ప్రభాతవార్త

ఊర కుక్కల దాడిలో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని సీతానాగారం శివారు కొమ్ములవంచ గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన మైదం కమలమ్మ, చేరాల యాదమ్మ అనే ఇద్దరు మహిళలను కుక్కలు కరిచి తీవ్రంగా గాయపడగా వారిలో ఒకరిని నర్సంపేటకు మరొకరిని మానుకోట ఆసుపత్రులకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. గ్రామంలో కుక్కలు పిచ్చి కుక్కల మాదిరిగా తిరుగుతున్నాయని, వైరస్ బారిన పడిన కుక్కలు ప్రమాదకరంగా మారాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు కోతులు, మరోవైపు కుక్కలతో ఎప్పుడు ఎవరికి ఏ ప్రమాదం ముంచుకువస్తుందోనన్న భయాందోళనలతో రోజులు గుడుపుతున్నామని అన్నారు. కుక్కల బారిని నుండి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ దిశగా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన మైదం వెంకన్నతో పాటు పలువురు కోరుతున్నారు.

## ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలి

పర్వతగిరి, జూలై 13, ప్రభాతవార్త



ముదిరాజ్‌లను బీసీ డీ నుండి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు కొత్తూరు రామ్మోహన్‌ముదిరాజ్ అన్నారు. శనివారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తుల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ముందు ముదిరాజ్‌లకు కాంగ్రెస్ పార్టీ యొక్క మేనిఫెస్టోలో ప్రకటించిన విధముగా అభయహస్తం హామిలో భాగమైన ముదిరాజ్ బీసీ–డి నుండి బీసీ–ఏకు మార్చాలని చెరువులు/కుంటలపై ముదిరాజ్‌లకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలని, ఈ నెల 15వ తేదిన సోమవారం నుండి 20 శనివారం తేది వరకు తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ముదిరాజ్ బిడ్డ పెద్ద ఎత్తున కదలి ప్రతి మండలంలోని రెవిన్యూ కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించాలని రాష్ట్రంలోని ముదిరాజ్ యువత బాధ్యతా యుతంగా పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డైరెక్టర్ అల్లాడి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి గుండా రాకేష్, సోషల్‌మీడియా పిట్టల రాజు తదితరులు పాల్గొన్నారు.

## వర్షం కోసం మహిళల ప్రత్యేక పూజలు

ఆలేరు ప్రభాతవార్త:



ఆలేరు మున్సిపల్ పరిధిలో 6వ వార్డు బహదూర్ పేట స్థానిక కృష్ణా రెడ్డి కాలనీలో వినాయకుని మండపం వద్ద మహిళలు వరుణ దేవవుడు కరుణించి వర్షం కురవాలని శనివారం బొడ్రాయికి నీళ్లు పోయడం, పసుపు కుంకుమలతో అభిషేకించడం, అందరూ వరుణ్ దేవుని వేడుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం వాన దేవుని పాటలతో బతుకమ్మ ఆడడం, వర్షాలు కురిపించి తమ పంటలు ఎండిపోకుండా చూడాలని వరుణ్ దేవుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు వట్టిపల్లి కనకమ్మా, ఇజమ్మా, కుళ్ళ బుచ్చమ్మ, వట్టిపల్లి భాగ్య, పల్లె యాదలక్ష్మీ, లలిత, వస్పరి స్వరూప, పల్లె మమతా, లావణ్య, బందు భాగ్య, బీదని అండమ్మా, వస్పరి అంజమ్మ, సిద్ధమ్మ, వట్టిపల్లి కవిత తదితరులు పాల్గొన్నారు.

## బస్సు మోపెడ్ ఢీ, వ్యక్తికి గాయాలు

వలిగొండ ప్రభాతవార్త:

ఆర్టీసీ బస్సు మోపెడ్(టీవీఎస్) ఢీ కొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలోని టెకులసోమారం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు మండలంలోని వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన బంగారు బిక్షపతి బంధువుల దశదిన కర్మ కార్యక్రమానికి టెకులసోమారం గ్రామానికి రాగా భువనగిరి – వలిగొండ రోడ్డు దాటుతుండగా భువనగిరి నుండి నల్లగొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనగా తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో సిబ్బంది భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

## మాజీ ఎంపీపీకి ఘనంగా నివాళులర్పించిన నేతలు

గుండాల ప్రభాతవార్త:



తాజా మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి(27) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఎంపీపీ స్వగ్రామమైన మరిపడిగ గ్రామంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విఫ్ బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, బూడిద బిక్షమయ్య గౌడ్, మాజీ టెస్ట్ ఆఫ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పిటీసీలు ధ్యాపకృష్ణారెడ్డి, చీర శ్రీశైలం, అశోక్, నూనెముంతల వెంకటేశ్వర్లు, రావుల హరిత దేవి, సంగి వేనుగోపాల్, కోల్కొండ యాదగిరి తదితరులు ఎంపీపీ తాండ్ర అమరావతి మృతదేహంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అమరావతి అంత్యక్రియలో భారీ సంఖ్యలో వివిధ మండలాల నుండి తరలివచ్చిన నేతలు పాల్గొని కన్నిటి వీడ్కోలు పలికారు.

## గ్రామపంచాయతీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

తుర్కపల్లి ప్రభాతవార్త:



గ్రామపంచాయతీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని గ్రామపంచాయతీ కార్మికుల తుర్కపల్లి మండల అధ్యక్షుడు పల్లెపాటి బాల నరసింహ అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విఫ్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, 15వ జీవో రద్దు చేయాలని, పిడబ్ల్యూ మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి కారోబర్లకు స్పెషల్ స్టేటస్ కేటాయించాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ వర్తింపు, గ్రామపంచాయతీ ఉద్యోగుల జీతాలు ట్రెజరీ నుండి నేరుగా ఇవ్వాలని, ప్రమాద బీమా, గుర్తింపు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాల పెంపు లాంటి డిమాండ్లపై వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎరుకల స్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ప్రచార కార్యదర్శి శేఖర్, సహాయ కార్యదర్శి మల్లేష్, కోశాధికారి కృష్ణ, కార్యవర్గ సభ్యులు గణేష్, శంకర్, పద్మ, బుజ్జి, ఆనందం, సక్రో, సుశీల, కర్ణాకర్, లక్ష్మీ, పుష్ప, రాజేశ్వరి, సత్తమ్మ, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

భువనగిరి రూరల్,ప్రభాతవార్త:

పట్టణ కేంద్రంలోని జీనియస్ హై స్కూల్‌లో ఆదివారం తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నామని తైక్వాండో అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కోన్ రెడ్డి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు కొండ సైదులు శనివారం తెలిపారు. 11 ఏళ్ల నుండి 14 ఏళ్లలోపు బాలబాలికలకు ఎంపికలు జరుగుతాయని, ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19 నుండి 21 వరకు మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లిలో జరుగు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## నేరాలు-దారుణాలు

### "నిత్య శ్రామికుడు" ఆర్టీసీ కండక్టర్

ప్రభాతవార్త- బాలసముద్రం:

అంతర్జాతీయ కండక్టర్స్‌డే సందర్భంగా కండక్టర్‌లందరికి ఈ కవిత
అందరి మన్ననలు పొందుతూ...
తలలో నాలుకయై నిలుస్తూ..
రాబడిని ఆర్టీసికి పెంచుతూ..
జనులందరికి సేవ చేస్తూ..
తీరం చేర్చే నావలా బస్సును గమ్యం చేర్చుతూ..
యజ్ఞంలా వృత్తి ధర్మాన్ని పాటిస్తూ..
కంటికి రెప్పలా బస్సును కాపాడుతూ..
డబ్బులను సంస్థకు సంపాదించి పెడుతూ..
కరక్ట్ టైంకు బస్సులను గమ్యాలకు చేరేలా కండక్ట్ చేస్తూ..
తనిఖీ అధికార్ల తీరుతెన్నులకు మధన పడుతూ..
నూతనోత్సాహంను పోగు చేసుకుంటూ..
వత్తిడిని అధిగమిస్తూ..
అనుక్షణం మందులతో సహవాసం చేస్తూ..
కుటుంబ సభ్యుల శుభకార్యాలకు సైతం తిలోదకాలిస్తూ..
భారంగా నైనా బాధ్యతగా ప్రవర్తిస్తూ..
విభిన్న పాత్రలను అవలీలగా పోషిస్తూ..
అష్టావాదనాన్ని మరిపించేలా మేధస్సును వినియోగిస్తూ..
అనుదినమూ చైతన్యవంతం అవుతూ..
ఆర్టీసి పురోగతికై చెమటోడ్చి శ్రమించే నిత్య శ్రామికుడు బస్సు కండక్టర్!
వాళ్ళందరికి చెబుదాం శుభాకాంక్షలు వన్మోర్!!!

– అంతర్జాతీయ కండక్టర్ల దినోత్సవ శుభాకాంక్షలతో

– మీ ఎంఎస్‌రావు రిటైర్డ్ ఆర్టీసి కండక్టర్ వరంగల్–2 డిపో

## కాంగ్రెస్ మాటలు కోటలు చేతులు శూన్యం

### రావుపద్మ-బిజెపిలో చేరిన యువత

ప్రభాతవార్త- సుబేదారి:



కాంగ్రెస్ నాయకులు మాటలు కోటలని కాని చేతలు మాత్రం శూన్యమని బిజెపి హన్మకొండ జిల్లా అధ్యక్షులు రావు పద్మరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం 7వ డివిజన్ అధ్యక్షులు కల్లూరి కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మచిలిబజార్, కాపువాడ నుండి రావుల విక్రమ్‌ల ఆధ్వర్యంలో 15మంది యువ నాయకులను బిజెపి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు రత్నా లక్ష్మి, రాష్ట్ర ఓబీసీ మోర్చ నాయకులు, మాజీ కార్పొరేటర్ రావుల సుదర్శన్, 7వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈవోలకు దేవాదాయ శాఖ తీపి కబురు

ప్రభాతవార్త- బాలసముద్రం:

అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రివర్యులు కొండాసురేఖ చొరవతో దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్లు గొప్ప ఉపశమనం లభించింది. గత ఆరు సంవత్సరాలుగా సర్వీస్ రూల్స్ సీనియారిటీ లీస్టను రూపొందించకపోవడంతో ప్రోమషన్లు లేక అసంతృప్తికి గురవుతున్న ఈవోలకు దేవాదాయ శాఖ తీపి కబురు అందించింది. గత ఆరు సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన సర్వీస్ రూల్స్‌కు సవరణ చేయడంతో ఎంతో కాలంగా ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న 11మంది ఈవోలకు పదోన్నతి లభించింది. వీరిలో ముగ్గురు గ్రేడ్ 3 ఈవోలు గ్రేడ్ 1 ఈవోలుగా 8మంది గ్రేడ్ 3 త్రీ ఈవోలు గ్రేడ్ 2 ఈవోలుగు పదోన్నతి పొందారు. సీనియార్టీ లీస్టు పూర్తికాగానే మరికొన్ని రోజుల్లో మరో 11మంది ఈవోలకు పదోన్నతి లభించనుంది. ఈ సందర్భంగా తెలంగాణ ఎంటోమెంట్స్ డిపార్ట్‌మెంట్ టెంపుల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బేతి రంగారెడ్డి, మంత్రి సురేఖకి ధ్యవాదాలు తెలిపారు. తమ సమస్యను పరిష్కరించాలంటూ మంత్రి సురేఖని విన్నవించిన నెలరోజుల్లోనే మంత్రి స్పందించి తమ సమస్యలను పరిష్కరించారని వారు ఆనందం వ్యక్తం చేశారు.

# కలెక్టర్‌లు పర్యటించిన పనుల్లో పురోగతి కరువు

**-పాఠశాలలు ప్రారంభమై ఒక మాసం**

**-అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై తల్లిదండ్రుల పెదవి విరుపు**

**-ఎంబీలు చేయకుండానే రూ.18.91లక్షల నిధుల చెల్లింపు..!**

*చిట్యాల, జూలై 13, ప్రభాతవార్త*

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు పాఠశాలలో మౌళిక వసుతల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించింది. నిధులతో పాఠశాలల పున:ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పనులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల ఛైర్మన్‌లుగా విఓ అధ్యక్షులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. మండలంలోని 24పాఠశాలలకు మరమ్మతుల కల్పన కోసం ఎంపిక చేసి రూ.79.17లక్షల నిధులను మంజూరు చేసింది. ఇట్టి నిధులతో విద్యుత్తు సరఫరా మరమ్మతులు, పాఠశాలలో మైనర్ రిపేర్లు, తాగునీటి సరఫరాకు, గర్ల్స్ టాయిలెట్స్ 2, మరుగుదొడ్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. పాఠశాలలకు కేటాయించిన నిధులు ఇలా ఉన్నాయి. గిద్ద ముత్తారం పాఠశాలకు రూ.4.36లక్షల నిధులు, ఎంపీపీఎస్ వెంచరామికి రూ.2.30, ఎంపీపీఎస్ ఒంటిప్ప తండాకు రూ.3.70, ఎంపీపీఎస్ ఛైన్‌పాకకు రూ.1.90, గౌటు(డిఎన్‌టి) ఎంపీపీఎస్ అందుకుతండాకు రూ.1.07, ఎంపీపీ యుపిఎస్ అందుకుతండాకు రూ.2.46, ఎంపీపీఎస్ నవాబుపేట(హెచ్‌డబ్ల్యు)4.50, ఎంపీ యుపీఎస్ చింతకుంట రామయ్యపల్లికి రూ.3.80, ఎంపీపీఎస్ నవాబుపేటకు 2.95, ఎంపీపీఎస్ కైలాపూర్‌కు 2.30, ఎంపీపీఎస్ కొత్తపల్లి 2.60, ఎంపీపీఎస్ లక్ష్మీపూర్ తండాకు 5లక్షలు, ఎంపీపీఎస్ పాసిగడ్డ తండాకు 5.75, ఎంపీపీఎస్ కొత్తపుటకు 4లక్షలు, ఎంపీపీఎస్ ఒడితలకు 4.70, ఎంపీపీఎస్ గాంధీనగర్‌కు 3,25, ఎంపీపీఎస్ భీష్మనగర్‌కు 2.60, ఎంపీపీఎస్ భావుసింగ్‌పల్లికి 3.40, ఎంపీపీఎస్ తిరుమలాపూర్‌కు 4.15,



ఎంపీపీఎస్ వెంకట్రావుపల్లి(సి)కి 3,10, ఎంపీపీఎస్ ఏలేటి రామయ్యపల్లికి రూ.2.40, ఎంపీపీఎస్ ముచినిపర్తికి 4.50, ఎంపీపీఎస్ దూత్‌పల్లికి 2,40లక్షల నిధుల చొప్పున పాఠశాలలకు కేటాయించింది. ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతినీ బట్టి రూ.18.91లక్షల నిధులను మాత్రమే ఎంబీలు లేకుండా చెల్లించినట్లు తెలుస్తోంది. విద్యుత్తు సరఫరా ఏర్పాట్లు పూర్తిస్థాయిలో పూర్తయ్యాయని, మైనర్ రిపేర్‌లు 10పాఠశాలల్లో జరుగుతున్నట్లు పేర్కొన్నారు. మరుగుదొడ్ల పనుల విషయంలో పురోగతి రావాల్సి ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. పాఠశాలల ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని, అప్పటి కలెక్టర్ భవేష్ మిశ్రా, ప్రస్తుత కలెక్టర్ రాహూల్ శర్మలు అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను ప్రత్యక్షంగా పర్యటించినప్పటికీ పనులు పూర్తికాకపోవడం విమర్శలకు తావిస్తుంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పనుల్లో నాణ్యత కొరవడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బిల్లు చెల్లింపుల్లో అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రతి బిల్లుకు అధికారులు ముందస్తుగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. పనుల పురోగతిపై ఎంపిడీఓను వివరణ కోసం యత్నించగా అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు మౌళిక వసతులను అందుబాటులో ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన వరంగల్ కలెక్టర్

*హనుమకొండ ఎడ్యుకేషన్, జూలై 13, ప్రభాత వార్త :*



వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఖిలా వరంగల్ మండలంలోని జక్కులుద్ది తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కాలేజ్‌ను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, కంప్యూటర్ గదిని, వంటశాలలను పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి సబ్జెక్టుల వారిగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు చెప్పిన సమాధానంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని కోరారు. బోదిస్తున్న విద్య, అందుతున్న సేవల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు కలెక్టర్ అడిగారు. కళాశాల అవరణలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భోజనం, విద్య, పాఠశాల నిర్వహణ సక్రమంగా జరగాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులకు రోజువారీగా అంది స్తున్న మెనూ గురించి ఆరా తీశారుఈ సందర్బంగా కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జక్కలొద్ది నుండి పాఠశాలకు రహదారి బాగులేనందున రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ బిక్షపతి తదితరులు ఉన్నారు.

# జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

**మొదటి పేజి తరువాయి**

విద్యార్థులకు సంపూర్ణమైన విద్యను అందించాలని, విద్యార్థులు విద్యతో పాటు సమాజంపై కూడా అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో 135.00 లక్షల రూపాయలు, తాడ్వాయి మండలంలో 205.00 లక్షల రూపాయలు సమగ్ర శిక్ష నిదులతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ తరగతి గదులు, వసతి భవనాన్ని మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు, సదుపాయాలు కల్పిస్తున్నామని పదవ తరగతి నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి చదువు ఒక్కటే మార్గమని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి అని నూతన పరిజ్ఞాన అంశాలను నేర్చుకొని విద్యార్థులకు బోధించాలని, ఉపాధ్యాయుల ప్రవర్తన విద్యార్థులపై ఉంటుంది కాబట్టి



ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శ ప్రాయంగా నిలవాని సూచించారు. విద్యార్థులను అనుమతి లేకుండా బయటికి పంపకూడదని విద్యాలయ అధికారులను ఆదేశించారు. గ్రౌండ్ లేవలింగ్ బోర్స్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.

**ప్రజా దర్బారులో పాల్గొన్న మంత్రి సీతక్క**

తాడ్వాయి మండలంలోని లింగాల గ్రామంలో ప్రజా దర్బార్‌లో



మంత్రి పాల్గొన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్నా సమస్యలను పరిష్కరించడాఇకి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ప్రతి సీతక్క అన్నారు. కొత్త పోడు కొట్టడం మానేసి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను పెంచాలన్నారు. ప్రభుత్వం త్వరలో పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్.ఎస్పీ. శబరీష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల పి.శ్రీజలతో కలిసి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. లింగాల, లవ్వల, బందాల, కొడిశాల గ్రామాలకు చెందిన ప్రజల నుంచి పోడు భూముల పట్టాలు, జీసీసీ డిపో ఏర్పాటు, రహదారి సౌకర్యం, విద్యుత్ ఏర్పాటు, బస్సు రవాణా సౌకర్యం వంటి సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, వికలాంగులకు సదరం క్యాప్, ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలకు మీ సేవ కేంద్రాల ఏర్పాటు మహిళ్ల శక్తి క్యాంటిన్‌ల ఏర్పాటుపై అవగాహన కల్పించి వారికి ప్రోత్సాహం అందిస్తామని మహిళలు ముందుకు రావాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని అంగన్వాడీ టీచర్‌ను ఆదేశించారు.

**తెలంగాణ రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పతి ప్రారంభించిన మంత్రి :**

తెలంగాణ రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రిని (ఆరోగ్య ఉప కేంద్రం) మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు,పి.శ్రీజలతో కలసి ప్రారంభించారు. సమీపంలో ఉన్న ఐదు గ్రామాలకు ఈ కంటైనర్ ఆసుపత్రి అందుబాటులో ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులు పై ప్రత్యేక దృష్టితో ఐదు మారుమూల గ్రామాల కోసం రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆసుప్రతి అందుబాటులో ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధుల పై ప్రత్యేక దృష్టితో ఐదు మారుమూల గ్రామాలకోసం రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆసుపత్రి (ఆరోగ్య ఉపకేంద్రం) ను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఈ ప్రాంతంలో గుట్టలపై ఐదు గ్రామాల ప్రజలు నివసిస్తున్నారని, ఆరోగ్యసమస్యలు వస్తే అనేక ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోని తొలి కంటైనర్ ఆసుపత్రిని ఏర్పాటు చేశామని తెలిపారు. నాలుగు పడకల కోసం సుమారు రూ. 7 లక్షల వ్యయంతో దీన్ని రూపొందించామని రెండు రోజుల క్రింత హైదరాబాదు నుంచి ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చిపోచారం గ్రామంలో ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కంటైనర్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స నిమిత్తం నాలుగు బెడ్స్, మందులు ఏర్పాటు చేశామని ఒక ఏఎన్ఎం, ఒక ఆశా కార్యకర్త విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. అనంతరం మంత్రి పోచపూర్‌లోని గురుకులంను పరిశీలించారు మంత్రి సీతక్క విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఏక రూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

